PDF Compressor Free Version

Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03 నెల్లూరు, 15.11.2013, శుక్రవారం సంపుటి : 33 సంచిక : 24 పేజీలు : 12, వెల : ₹ 4



Dr. A.Swaroop Kumar Reddy, M.D.S.,
Professor - Department of Conservative Dentistry
Specialist - Cosmetic, Lasers & Implant Dentistry
ISO 9001-2008
CARE SUPER SPECIALITY DENTAL HOSPITAL
16-1/72, Pogathota, Nellore -524 001, (A.P.)
Ph: 0861-2303300, 6555555
Reimbursement Facility For State Government, APSPDCL & SHAR Employees


# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

# ఎవరిగోల వారిదే!



- ఎవరి అభిప్రాయం వారిదే • ఎవరి దారి వారిదే • తెలంగాణకు స్పష్టత ఇవ్వని అఖిలపక్షం



రాహుల్‌గాంధీని ప్రధానిగా చూడాలి... ఇదే సోనియాగాంధీ కోరిక. 2014లో అది సాధ్యం కాకుంటే ఇంకెప్పటికి సాధ్యమవుతుందో తెలియదు. సోనియాగాంధీ ప్రస్తుతం అనారోగ్యంతోవుంది. తాను ఆరోగ్యంగా వున్నప్పుడే రాహుల్‌కు రాజకీయ భద్రత కల్పించాలి. అందుకోసం ఏ అడ్డదారులైనా తొక్కాలి. ఈ ఆలోచనల్లో నుండి పుట్టిందే తెలంగాణ విభజన. తెలంగాణ కావాలని వాళ్లు ఉద్యమించినన్ని నాళ్లు కాంగ్రెస్ అధిష్టానం దాని జోలికే పోలేదు. కాని సీట్ల బేరీజు వేసుకుని 2014 ఎన్నికల దృష్టితో చూసేసరికి కాంగ్రెస్‌కు తెలంగాణ అవసరమొచ్చింది. కాబట్టే రాష్ట్ర విభజనకు పూనుకుంది.

సరే, రాష్ట్ర విభజన నిర్ణయాన్నయినా చిత్తశుద్ధితో అమలు చేస్తుందా? అంటే అదీలేదు. ఈ విషయంలో బుద్ధితక్కువతనంగా వ్యవహరిస్తుంది. చరిత్రలో సరిదిద్దుకోలేని తప్పులకు పాల్పడుతుంది.

హడావిడి నిర్ణయాలు, పొంతనలేని విధానాలు, అర్థంపర్థం లేని ప్రకటనలు, లక్ష్యంలేని సమావేశాలు... ఇదీ రాష్ట్ర విభజనపై కాంగ్రెస్ అనుసరిస్తున్న తీరు. రాష్ట్ర విభజన పర్యవసానాలకు నూరుశాతం బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే! రాష్ట్ర విభజన నిర్ణయం ప్రకటించకముందే విధివిధానాలను కేంద్రం ఖరారు చేసుకుని వుండాలి. సీమాంధ్రకు ఎలా న్యాయం చేయాలనుకుంటున్నారు, కొత్త రాజధాని (మిగతా 10వ పేజీలో)

# టిడిపి డైరక్షన్.. బీజేపీ యాక్షన్


## విభజన అంశం ఆధారంగా పెరుగుతున్న అనుబంధం

రాష్ట్ర విభజన నాటకంలో రాజకీయ ప్రయోజనాలే ప్రధానపాత్ర పోషిస్తున్నాయి. కాంగ్రెస్ రాజకీయ ప్రయోజనాలు ఆశించే విభజన నాటకాన్ని మొదలుపెట్టగా మిగతా పార్టీలు కూడా ఆ నాటకంలో కాంగ్రెస్‌కంటే ఎక్కువగానే నటిస్తున్నాయి. కొన్ని పార్టీల నటన అయితే ప్రేక్షకులనబడే ఆంధ్ర ప్రజల చేత కన్నీళ్లు పెట్టిస్తూ రక్తి కట్టిస్తుంది.

ఈ విభజన నాటకంలో బీజేపీ కీలక రోల్ పోషించనుంది. ఈ నాటకంలో ఎవరు హీరో అవుతారో, ఎవరు విలన్‌గా మిగులుతారో అర్థం కాని అయోమయ పరిస్థితి నెలకొంది. ఈ అంశంలో ప్రతిపార్టీ కూడా హీరో రోల్ కోసమే పోరాడుతుంది.

విభజనపై రెండుకళ్ల సిద్ధాంతాన్ని అనుసరించి చంద్రబాబు రెంటికి చెడ్డ రేవడి అయ్యాడు. ఒక స్పష్టమైన విధానం లేకపోవడం వల్ల తెలుగుదేశం పార్టీ అటు తెలంగాణలో, ఇటు సీమాంధ్రలోనూ నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రం రెండుగా చీలిపోతే చంద్రబాబుకు రెండు చోట్లా నష్టమే. తెలంగాణలో కాంగ్రెస్, టీఆర్ఎస్, సీమాంధ్రలో వైకాపా రాజకీయంగా ప్రయోజనం పొందుతాయి.

ఈ పరిస్థితిని మార్చాలంటే 2014 ఎన్నికల దాకా రాష్ట్రం విడిపోకూడదు. ఇప్పుడున్న రాష్ట్రంలోనే ఎన్నికలు జరగాలి. ఇలా జరగాలంటే బీజేపీ సహకారం కావాలి. బీజేపీ మద్దతు లేనిదే తెలంగాణ ఏర్పడడం అసాధ్యం. కాబట్టి బీజేపీని చంద్రబాబు తనదారిలోకి తెచ్చుకున్నాడు. విభజన బిల్లు విషయంలో తన డైరక్షన్‌లో బీజేపీ వ్యవహరించేలా మాట్లాడుకున్నాడు. రాష్ట్రంలో బీజేపీ, టీడీపీల మధ్య పొత్తు దాదాపు ఖరారైనట్లే. పొత్తు కలిస్తే రెండు ప్రాంతాల్లో కూడా ఈ పార్టీలకు కొన్ని సీట్లన్నా దక్కుతాయి. ఎన్నికలలోపు రాష్ట్ర విభజన జరక్కపోతే తెలంగాణలోనూ కాంగ్రెస్‌కు నష్టం తప్పదు. అప్పుడు అక్కడ ప్రధానపోటీ టీఆర్ఎస్, తెలుగుదేశం, బీజేపీ కూటమి మధ్యే వుంటుంది. సీమాంధ్రలోనూ కాంగ్రెస్ చాపచుట్టేస్తుంది. అక్కడ కూడా వైకాపా, టీడీపీ, బీజేపీ కూటమి మధ్యే ప్రధానపోటీ వుంటుంది. వైకాపా (మిగతా 10వ పేజీలో)



# ఆదాల... సొంత గూటికేనా?

ముసుగుతుందనుకున్న పడవలో ఒడ్డును చేరుకోవాలనుకోవడం మూర్ఖత్వమే అవుతుంది. నేటితరం రాజకీయ నాయకులైతే ఈ సత్యాన్ని బాగా వంటబట్టించుకున్నారు. కాబట్టే కాలానికనుగుణంగా తమ నిర్ణయాలు తీసుకుంటుంటారు.

రాష్ట్ర రాజకీయాల్లో కాంగ్రెస్‌పార్టీ టైటానిక్ ఓడలా మారింది. రాజకీయంగా చావాలనుకున్నవాళ్లే (మిగతా 10వ పేజీలో)

# ఏ.పి 'చీప్'మినిస్టర్

## ఎవరికీ ఆసక్తి లేకుండా పోతుంది



ఆంధ్రప్రదేశ్ చీఫ్‌మినిస్టర్ పదవి చాలా చీప్‌గా మారింది. సీఎం పదవి ఇస్తామంటే ఎగిరి గంతేస్తారు నాయకులు. అలాంటిది పిలిచి పదవి ఇస్తామంటున్నా మాకొద్దంటున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పదవి ఇంత చీప్‌గా తయారు కావడానికి కారణం కాంగ్రెస్ అధిష్టానమే.

ఇప్పుడు ఎవరు సీఎం పదవిని తీసుకున్నా చరిత్రహీనులుగా నిలిచిపోతారు. ఒకవేళ చరిత్రహీనులుగా మిగిలిపోవడానికి ఎవరన్నా సిగ్గుశరం వదిలి ధైర్యం చేసినా అక్కడ సీఎం పదవి వుండేది మహా అంటే ఐదు నెలలే! రాష్ట్రంలో నెలకొన్న గందరగోళ పరిస్థితుల మధ్య ఎవరు కూడా ఆ సీఎం కుర్చీలో మనశ్శాంతిగా కూర్చోలేరు. రాష్ట్ర విభజన విషయంలో ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి కాంగ్రెస్ అధిష్టానానికి కొరుకుడుపడని కొయ్యగా మారాడు. సొంత పార్టీ సీఎం విభజన నిర్ణయాన్ని గట్టిగా వ్యతిరేకిస్తుండడంతో కాంగ్రెస్ అధిష్టానం సమాధానం చెప్పుకోలేకపోతుంది. కిరణ్‌కు కూడా సీఎం పదవిలో ఉండాలని లేదు. తన హయాంలో తెలంగాణ రాదని ఆయన పదేపదే చెబుతున్నారు. తెలంగాణ బిల్లును కేంద్రం మొండిగా తీసుకొస్తే ఆయన సీఎం పదవికి రాజీనామా చేసే (మిగతా 10వ పేజీలో)

# TRADEMARK CAUTION NOTICE

1. This is to bring to the notice of the general public that Our Client's **M/s.RAINBOW CHILDREN'S MEDICARE (P) LTD.**, NO. 22, Road No. 10, Banjara Hills, Hyderabad - 500034, A.P, are engaged interalia in providing services of diagnostic & clinical, medical and hospital services (hereinafter referred to as the said services) under the trademark **"RAINBOW"** which has been extensively used by our client's for a long period of time in course of their business and is also registered as a Trademark in clause 42 under the Trademark Act, 1999. The said Trademark **"RAINBOW"** due to our client's excellent services has become a household name and has gained enviable amount of goodwill and reputation among the members of the general public and has become identified with our client's services only.

2. It has come to our client's notice that various unscrupulous persons including doctors to cash on our client's reputation are falsely applying/using our client's trademark **" RAINBOW"** as the name of their hospitals/establishment with an oblique motive of indicating some association/ connection to our clients. Therefore by this notice it is hereby brought to the attention of all such persons that our client's to protect and reputation will not hesitate to initiate legal proceedings both civil and criminal against any person/ establishment illegally using our client's Trade Mark **"RAINBOW"** or any other deceptively similar Trademark including conducting searches/ police raids filing suits, claiming damages as per law at the risk and consequences of such persons/establishment.

Sd/-
Hirendernath Advocate
For Orient Lawfirm Advocates
Plot No.43, UBE Colony, Road No.3, Banjara Hills, Hyderabad - 500 034. Ph: 040 23556360/97/23556885



# హౌస్‌ఫుల్ అయిన వైకాపా... ఆహ్వానం పలుకుతున్న తెదేపా

**సీమాంధ్రలో కాంగ్రెస్ పార్టీ ఎత్తిపోతుంది. ఆ పార్టీలో వున్న నాయకులకు గ్యారంటీగా ఇంకో 5ఏళ్ల భవిష్యత్ లేదు. ఆ తర్వాత కూడా ఉం టుందన్న నమ్మకం లేదు. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్‌లో వున్న పలువురు నాయకులు ఇతర పార్టీల వైపు మొగ్గుచూపుతున్నారు.**



రాష్ట్రంలో జగన్ హవా కొనసాగుతుంది. కాంగ్రెస్ వుంటే లాభం లేదనుకున్న ఆ పార్టీ నాయకులు చాలామంది వైయస్సార్ కాంగ్రెస్‌లో చేరారు. రాష్ట్ర విభజన నిర్ణయం తర్వాత వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ తెలంగాణలో అటుంచితే సీమాంధ్రలో ఇంకా బలపడింది. కాంగ్రెస్ అధిష్టానం విభజన నిర్ణయం తీసుకున్నాక ఆ పార్టీకి చెందిన పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు వైకాపాలో చేరడం జరిగింది. ఇప్పటికీ నేతలు దండిగా చేరడంతో వైకాపాలో సీట్లు భర్తీ అయినట్లే. ఇటీవలే రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలకు సమన్వయకర్తలను నియమించారు. రేపు అభ్యర్థులుగా కూడా దాదాపు వీళ్లే ఉంటారు.

నెల్లూరుజిల్లాలో తీసుకుంటే నెల్లూరు లోక్‌సభతో పాటు 10అసెంబ్లీ నియోజకవర్గాలకు సమన్వయకర్తలను ప్రకటించారు. దాదాపు సీట్లు కూడా ఖరారు చేసినట్లే. ఒకట్రెండు తప్పితే పెద్దగా మార్పులు చోటు చేసుకునే అవకాశాలు లేవు. కాబట్టి జిల్లాలో కాంగ్రెస్ నుండి వైకాపాలోకి వెళ్లాలనుకునేవారికి ఎలాంటి అవకాశాలూ లేవు. సీట్ల గ్యారంటీ లేదు. ఈ పరిస్థితిని తెలుగుదేశం వాళ్లు ఉపయోగించు కుంటున్నారు. కాంగ్రెస్ నుండి వలస రావాలనుకుంటున్న వారికి బ్యానర్లుకట్టి మరీ ఆహ్వానం పలుకుతున్నారు. ఇటీవలే వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి అనే కోవూరు నియోజకవర్గానికి చెందిన నాయకుడు తెలుగుదేశంలో చేరాడు. ఇతనికి కోవూరు సీటు ఇస్తామని హామీ ఇచ్చినట్లు తెలుస్తుంది. ఇదే నియోజకవర్గానికి చెందిన మాజీఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి కూడా తెలుగుదేశంలో చేరుతారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇక కాంగ్రెస్‌లో వుంటున్న ఓ ముఖ్య నాయకుడు కూడా తెలుగుదేశంలో చేరుతారనే ప్రచారం జరుగుతుంది. ఆయన పార్టీలో చేరితే కేడర్‌కు ఎంతో వూపు వస్తుంది. నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి కొరత కూడా తీరుతుంది. పార్లమెంటు బరిలో అతను బలమైన అభ్యర్థి అయ్యే అవకాశముంది. మొదట ఆయన వైకాపాలో చేరుతాడని అందరూ భావించినప్పటికీ, సీట్ల విషయంలో సర్దుబాటు కానట్లు సమాచారం. దీంతో తెలుగుదేశం వాళ్లు ఆయనను తమ పార్టీలోకి లాక్కునే ప్రయత్నాలు చేస్తున్నారు.

అలాగే ఉదయగిరి, ఆత్మకూరులకు చెందిన ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలను కూడా తిరిగి పార్టీలోకి రప్పించే ప్రయత్నాలు జరుగు తున్నట్లు సమాచారం. మొత్తంమీద ఎన్నికల నాటికి కాంగ్రెస్‌కు చావుకళ వస్తే, తెలుగుదేశంకు చావుకళ తప్పి పెళ్లికళ వచ్చేటట్లుంది.

## ఆఫీసులు సరే... ఆఫీసర్లేరి?

నాలుగు నెలల క్రితం జిల్లాలో కొత్తగా నాయుడుపేట, ఆత్మకూరు రెవెన్యూ డివిజన్లను ఏర్పాటు చేసారు. రెవెన్యూశాఖామంత్రి రఘువీరా రెడ్డి వచ్చి వీటిని ప్రారంభించడం కూడా జరిగింది. ఈ రెవెన్యూ డివిజన్ల పరిధిలో మండలాలను కూడా నిర్ణయించారు. అయితే ఈ రెండు డివిజన్లకు కూడా ఆర్డీఓలను నియమించారు గాని వారి క్రిందస్థాయి సిబ్బందిని నియమించలేదు. దీంతో అక్కడ ఎటువంటి పరిపాలనా సాగడం లేదు. సూపరింటెండెంట్లు, డిప్యూటీ తహశీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్లు లేక పోవడంతో పాలనా పరమైన సమస్యలు ఎదురవుతున్నాయి. ఇక్కడ సిబ్బంది నియామకానికి కలెక్టర్ శ్రీకారం చుడుతున్నట్లుగా తెలుస్తుంది.



# ఆత్మకూరులో ఇక... మాసుకేళి

<u>మేకపాటి కుటుంబంలో రెండోతరం నాయకుడు మేకపాటి గౌతంరెడ్డి ప్రత్యక్ష రాజకీయ ప్రవేశానికి రంగం సిద్ధమైంది. గౌతంరెడ్డి ఇప్పటివరకు తెరవెనుక రాజ కీయాలకే పరిమితమవుతూ వచ్చారు. 30ఏళ్లుగా తమ కుటుంబం రాజకీయాలలో వుంటున్నప్పటికి గౌతంరెడ్డి పేరు వినిపిస్తున్నది జగన్ వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీని స్థాపించినప్పటి నుండే! జగన్‌తో గౌతంకు వున్న స్నేహం వల్లే మేకపాటి సోదరులు కాంగ్రెస్‌ను వదిలి వైకాపాలో చేరాల్సివచ్చిందనే ప్రచారం కూడా వుంది.</u>

జగన్ కూడా గౌతంకు ఎంతో ప్రాధాన్యతనిస్తాడనే పేరుంది. జిల్లాలో నెల్లూరు లోక్‌సభతో పాటు ఉద యగిరి, ఆత్మకూరు అసెంబ్లీలను జగన్ మేకపాటి కుటుంబానికే అప్పగించాడు. అయితే తమ కుటుంబంలో ఎవరు ఎక్కడ నిలబడాలనే సందిగ్ధంలో ఇంతవరకు వున్నారు. ఇప్పుడు రాజమోహన్‌రెడ్డి ఎంపీ స్థానానికే తిరిగి పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తుంది. అలాగే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి యథాతథంగా ఉదయగిరి బరిలోనే వుండనున్నారు. ఇక ఆత్మకూరు సమన్వయకర్తగా వున్న గౌతంరెడ్డి రేపు ఎన్నికల్లో అక్కడ నుండే పోటీకి దిగేందుకు రంగం సిద్ధం చేసుకుంటు న్నట్లు సమాచారం.

కొన్ని నెలల క్రితం గౌతంను ఆత్మకూరు సమన్వయ కర్తగా నియమించారు. అయితే అప్పటి నుండి గౌతం ఆత్మకూరులో కాలు పెట్టలేదు. ఓ పక్క మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఎన్నో అభివృద్ధి పథకాలకు నిధులు కుమ్మరిస్తూ ప్రజలలో సానుకూల వాతావరణాన్ని తెచ్చుకున్నాడు. కాంగ్రెస్ పట్ల వ్యతిరేకత వున్నా రామ నారాయణరెడ్డి వ్యక్తిగతంగా ప్రతిష్ట పెంచుకోసాగాడు. వైకాపాలో మాస్తే పార్టీ కార్యకర్తలకు గౌతంరెడ్డి అందు బాటులో లేకుండాపోయాడు. స్థానిక నాయకులే పార్టీ కార్యక్రమాలను నిర్వహించాల్సి వచ్చింది. సమైక్యాంధ్రకు మద్దతుగా నియోజకవర్గాల సమన్వయకర్తలంతా దీక్షలు నిర్వహించాలని జగన్ పిలుపునిస్తే, జిల్లాలోని 9నియోజకవర్గాలలో సమన్వయకర్తలు దీక్షల్లో కూర్చు న్నారు. కాని ఆత్మకూరులో మాత్రం గౌతంకు బదులుగా స్థానిక నాయకులు కూర్చోవాల్సివచ్చింది.

మొన్నటిదాకా పోటీ చేయడం ఇష్టంలేకే ఆత్మ కూరుకు గౌతం దూరంగా వున్నాడని సమాచారం. అయితే ఇప్పుడు తమ కుటుంబానికి వచ్చిన సీటును ఇంకొకరికి వదులుకునేది ఇష్టం లేకనే పోటీకి సిద్ధ మవుతున్నట్లు సమాచారం.

# పెరుగుతున్న కార్లు.. తరుగుతున్న దార్లు

**ఒకప్పుడు కారు విలాసవస్తువు. ఇప్పుడు సౌకర్యంగా మారింది. ఇంకొద్ది కాలం పోతే అవసరమైన వస్తువు కావడం ఖాయం. మనిషి జీవితం అంత వేగంగా మారింది.**

20ఏళ్ల క్రితం నెల్లూరులో చెప్పుకోదగ్గ కల్యాణ మండపాలంటే కిసాన్‌నగర్‌లో పత్తివారి సత్రం, వప్పులవీధిలో పాండురంగ అన్నదాన సమాజం, పెళ్లకూరు అన సూయమ్మ కల్యాణ మండపం, దర్గామిట్టలో కస్తూర్బాకళాక్షేత్రం, కస్తూరిదేవి స్కూల్ ఆడిటోరియం. అప్పుడు ఎంతటి ధనికుల పెళ్లిళ్లు జరిగినా పెద్దగా ట్రాఫిక్ రద్దీ ఉండేదికాదు. ఎంతటి గొప్పోళ్లు పెళ్లి చేసుకుంటున్నా మహా అంటే పది లేదంటే ఇరవై దాకా కార్లు వచ్చేవి. వాటిని రోడ్ల మీద పెట్టుకున్నా పెద్దగా సమస్య ఉండేది కాదు. గతంలో పెళ్లిళ్ల వల్ల అంతగా ట్రాఫిక్ సమస్యలు వచ్చిన సందర్భాలు లేవు.

ఇప్పుడు కాలం మారింది. ధనికులకే కాదు, మధ్యతరగతి కుటుంబాలలో కూడా కార్లు ఉంటున్నాయి. ఒక కుటుంబం పెళ్లికి పోవాలంటే ఖచ్చితంగా కారు అవసరమవుతుంది. ఇలా నెల్లూరు నగరంలో కార్ల సంస్కృతి పెరిగిపోయింది. ఒక సాధారణ కుటుంబంలో జరిగే వివాహవేడుకకైనా కనీసం 50కార్లు ఖచ్చితంగా వస్తున్నాయి. ఇక వీఐపి కుటుంబాలలో జరిగే పెళ్లి వేడుకలకైతే కార్ల సంఖ్య వందల్లోనే వుంటుంది. అయితే కార్లు పెరిగినంతగా కల్యాణ మండపాలలో పార్కింగ్‌ను పెంచలేరుగా. అన్ని కల్యాణ మండపాలలో కార్లకు పార్కింగ్ ఇవ్వలేరుగా. ఇప్పుడదే జరుగుతుంది. నెల్లూరు నగరంలో ఎన్నో ఆధునిక కల్యాణ మండపాలు వెలిసాయి. అయితే ఇవన్నీ పెళ్లిళ్లకు వచ్చే అతిథుల కెపాసిటీకి తగ్గట్లు కట్టారేగాని, వాళ్లు తీసుకొచ్చే కార్లకు తగ్గట్లుగా కట్టలేదు. పెళ్లిళ్లకు వచ్చేవాళ్లు ఎక్కువుగా కార్లనే వేసుకుని వస్తున్నారు. కల్యాణ మండపాల వద్ద కార్లు పెట్టుకోవడానికి పార్కింగ్ వుండదు. దీంతో రోడ్ల మీదే కార్లను నిలిపేసి కల్యాణ మండపాలలోకి పోతుంటారు. దీనివల్ల ఆ రోడ్ల మీద తీవ్రంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతుంటాయి. పెళ్లిళ్ల సీజన్‌లో పోలీస్ ఆఫీసు రోడ్డులో పరిస్థితి చూస్తే ఈ విషయం అర్థమవుతుంది.

నగరంలో కల్యాణ మండపాలకైనా, కమర్షియల్ కాంప్లెక్స్‌లకైనా తగిన పార్కింగ్ చూపిస్తేనే కార్పొరేషన్ అనుమతినివ్వాలి. నిర్మాణదారుల్లో కమర్షియల్ దృక్పథం బాగా పెరిగింది. ఒక్క అంగుళం స్థలం కూడా వదలకుండా స్థలం మొత్తం కట్టేస్తున్నారు. ఆర్ అండ్ బి రోడ్లను పార్కింగ్ స్థలాలుగా వాడుకుంటున్నారు. కల్యాణ మండపాలు, కమర్షియల్ కాంప్లెక్స్‌లను ఒకే ప్రాంతంలో కట్టడం వల్ల కూడా ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ముఖ్యంగా కల్యాణ మండపాలకు నిర్ణీతస్థలం వుంటేనే అనుమతినిస్తే బాగుంటుంది.



# చిగురించని మెట్ట ఆశలు

**రాష్ట్రమంతా వర్షాలొచ్చి వరదలు ముంచెత్తినా నెల్లూరుజిల్లాలోని ఉదయగిరి మెట్ట ప్రాంతాన్ని మాత్రం వర్షాభావ పరిస్థితులు వెంటాడుతూనే వుంటాయి. జిల్లాలో సోమశిల నీటిని 9నియోజకవర్గాల ప్రజలు వినియోగించుకుంటున్నారు. కాని పక్కనేవున్న ఉదయగిరి నియోజకవర్గ ప్రజలకు మాత్రం ఆ భాగ్యం లేదు. సోమశిల నుండి ఇది ఎత్తైన ప్రాంతం కావడంతో నీళ్లు ఎక్కే దిక్కులేక వర్షాల మీదే ఆధారపడి ఈ ప్రాంతంలో రైతులు సేద్యాన్ని సాగించాల్సి వస్తుంది.**

ఆనం రామనారాయణరెడ్డి కృషితో సోమశిల నుండి ఉదయగిరికి దాదాపు 750కోట్ల రూపాయల అంచనాలతో హైలెవల్ కెనాల్ మంజూరయ్యింది. అయితే ఇంతవరకు ఇది సర్వేలకే పరిమితమైంది. మధ్యలో వచ్చిన సమైక్యాంధ్ర ఉద్యమాల గందరగోళంలో ఈ ప్రాజెక్ట్ ప్రశ్నార్థకం కానుంది.

ప్రస్తుతం సోమశిలలో నీళ్లున్నాయి. కాని ఉదయగిరి ప్రాంతానికి ఆ నీళ్లు దక్కవు. ఈ ప్రాంతానికి సాగునీటి అవకాశాలున్న సీతారాంసాగర్ రిజర్వాయర్ గురించి ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ఉదయగిరి సమీపంలోని గండిపాలెం రిజర్వాయర్ క్రింద 16వేల ఎకరాల ఆయకట్టు వుంది. అయితే ఈ రిజర్వాయర్‌లో నీళ్లు చేరడమే గగనంగా వుంది. ఉదయగిరి, సీతారాంపురం, మర్రిపాడు, వింజమూరు, దుత్తలూరు, వరికుంటపాడు, కొండాపురం మండలాలలోని రైతాంగం వర్షాల మీదే ఆధారపడి సేద్యం చేస్తుంటుంది. బావులు, చెరువులు నిండితేనే ఇక్కడ సాగుంటుంది. ఈ మండలాల్లో వర్షపాతం తక్కువుగానే వుంది. గత రెండేళ్లుగా వర్షాభావ పరిస్థితుల వల్ల వ్యవసాయం మందకొడిగా సాగింది. ఈ నెలలో వర్షాలపైనే ఇక్కడి రైతాంగం ఎక్కువుగా ఆశలు పెట్టుకుని వుంది. ఈ నెలలో వర్షాలు రాక బావులు, చెరువులు నిండకపోతే మెట్టరైతాంగం గుండె చెరువు కావడం ఖాయం.

PDF Compressor Free Version



# ఇది 'ఖర్మ'గారమే!



**కోవూరు మంచి డెల్టా ఏరియా అని చెప్పడానికి గుర్తు ఇక్కడ వున్న సహకార చక్కెర కర్మాగారమే. ఎన్నో దశాబ్దాలుగా కోవూరుకు ఇదొక ల్యాండ్‌మార్క్‌గా వుంది. అయితే నిర్వహణలో లోపం, రైతులకు బకాయిలు పేరుకుపోవడం, ఖర్చులు పెరగడం, తగినంత ఉత్పత్తి లేకపోవడం... ఇలాంటి సమస్యలన్నీ కలసి ఈ చక్కెర కర్మాగారం మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయి.**

చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా నష్టాల్లో వున్న పరిశ్రమలన్నింటిని మూతే యించాడు. ఈ జాబితాలో కోవూరు సహకార చక్కెర కర్మాగారాన్ని కూడా చేర్చారు. తెలుగుదేశం ప్రభుత్వంలో ఈ కర్మాగారాన్ని మూతేసి వేలానికి కూడా సిద్ధం చేశారు. అయితే వై.యస్. ముఖ్యమంత్రి అయ్యాక కోవూరు రైతాంగానికి ఇచ్చిన హామీమేరకు ఈ చక్కెర ఫ్యాక్టరీని తిరిగి తెరిపించారు. ఫ్యాక్టరీ నిర్వహణకు అవసరమైన నిధులు కూడా మంజూరు చేసారు.

అయితే ఇప్పుడు ఈ ఫ్యాక్టరీ పరిస్థితి గతంలాగే అధ్వాన్నంగా తయారైంది. ఫ్యాక్టరీలో చాలావరకు మిషనరీ మరమ్మత్తులకు గురయ్యాయి. కర్మాగార పరిపాలన అస్తవ్యస్తంగా వుంది. మిషనరీ మార్చడానికి కూడా నిధులు లేవు. 6కోట్ల దాకా రైతులకు బకాయిలున్నాయి. 3కోట్లు పెట్టి గతంలో కొనుగోలు చేసిన మిషనరీనే ఇంకా అమర్చలేదు. ఫ్యాక్టరీ ఎండీ దీర్ఘకాలిక సెలవు పెట్టి వెళ్లిపోవడంతో డిఆర్‌డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు ఈ ఫ్యాక్టరీ బాధ్యతలు అప్పగించారు. ఫ్యాక్టరీ పాలన గాడి తప్పి, మనుగడ సంశయాత్మకంగా మారడంతో ఉద్యోగులు, కార్మికులలో ఆందోళన నెలకొంటుంది.

ముఖ్యంగా నవంబర్ నెల వచ్చినా ఫ్యాక్టరీలో క్రషింగ్ ప్రారంభించలేదు. దీంతో రైతులు తాము పండించిన చెరకును ఈ ఫ్యాక్టరీకి తీసుకెళ్లాలో లేదో తెలియని స్థితిలో ఉన్నారు. కోవూరు ఫ్యాక్టరీ క్రింద చెరుకు పంట విస్తీర్ణం కూడా తగ్గింది. కొన్నేళ్ల క్రితం దాదాపు 30వేల ఎకరాలలో చెరుకు సాగు ఉండేది. ఫ్యాక్టరీ నిర్వహణకు తగినంత ఉత్పత్తి లభించేది. కాని ఆక్వాసాగు మోజు పెరగడం, చెరుకు సాగులో సమస్యల వల్ల చెరుకుసాగు ప్రస్తుతం 10వేల ఎకరాలకు పడిపోయింది. దీనికితోడు జిల్లాలో మరో రెండు చక్కెర కర్మాగారాలు వచ్చాయి. జిల్లాలో చెరుకు ఉత్పత్తిని మూడు కర్మాగారాలు పంచుకోవాల్సి వస్తుంది. దీంతో కర్మాగారంలో క్రషింగ్ వేయడానికి తగినంత ఉత్పత్తి రావడం లేదు. ఫ్యాక్టరీ మందకొడికి ఇదొక ప్రధాన కారణం కూడా!

నిర్వహణ వ్యయం పెరగడం, కార్మికులు, ఉద్యోగులకు జీతాలు చెల్లించే పరిస్థితి లేకపోవడంతో ఈ ఫ్యాక్టరీని మళ్ళీ మూతేస్తారనే ప్రచారం జరుగుతుంది. ఆ ఉద్దేశ్యంతోనే ఫ్యాక్టరీ ఆధునీకరణ జోలికి కూడా పోవడంలేదని, త్వరలో మూత ఖాయమని అంటున్నారు.

## 'రత్నం'లో బాలల దినోత్సవం



చాచానెహ్రూకు నివాళులర్పిస్తున్న రత్నం విద్యార్థినులు

ఈ నెల 14వ తేదీన మాజీప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని నెల్లూరు దర్గామిట్టలోని రత్నం ఒలింపియాడ్ స్కూల్‌లో బాలల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు నెహ్రూ చిత్రపటానికి పూలు చల్లి నివాళులర్పించారు. నెహ్రూపై విద్యార్థులు చేసిన ఉపన్యాసాలు, ఆలపించిన దేశభక్తి గీతాలు అందర్నీ అలరించాయి. కొంతమంది విద్యార్థులు ఫుడ్‌ఫెస్టివల్ మరియు ఆటల పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్స్ డా॥ కె.కృష్ణకిషోర్, వాసంతి కృష్ణకిషోర్‌లు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో స్కూల్ జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, ప్రిన్సిపాల్ మనోజ్‌కుమార్, వైస్‌ప్రిన్సిపాల్ పవిత్ర, మేనేజర్ సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 'విజయ'పథంలో డెయిరీ



పాల ఉత్పత్తిదారులకు గిట్టుబాటు ధరలు కల్పిస్తూ, వినియోగదారులకు నాణ్యమైన పాలఉత్పత్తులు అందజేస్తూ విజడెయిరీ ఎంతో పురోగతి సాధించిందని ఆ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి చెప్పారు. ఈ నెల 12వ తేదీ నెల్లూరులోని డెయిరీ ఆవరణలో జరిగిన పాలకవర్గ 10వ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ సహకార సంఘాల అధ్యక్షులు, పాలకవర్గ సభ్యులతో డెయిరీని సమర్థవంతంగా నడుపుతున్నామన్నారు. 2012-13 సంవత్సరానికి 108లక్షల లీటర్ల పాలను సేకరించాము, జిల్లా వ్యాప్తంగా రోజుకు 35వేల లీటర్ల పాలను సేకరించడం జరుగుతుంది. ఈ ఏడాది సహకార సంఘాలకు 80శాతం రాయితీతో 30 విత్తనపు దున్నపోతులను సరఫరా వేయాలని నిర్ణయించాము. పశుదాణా, వ్యాధినిరోధక టీకాలు, ఏలిక పాముల నివారణ మందులను కూడా రాయితీపై అందిస్తున్నాము. గేదెల కొనుగోలుకు ఋణ సదుపాయం కల్పిస్తున్నాము. డెయిరీ ఫారాలతో మంచి ఫలితాలు రాబడుతున్నామని ఆయన చెప్పారు. పాల ఉత్పత్తిదారులకు మూడేళ్లపాటూ నెలకు 50కిలోల పశుదాణాను ఉచితంగా అందజేస్తామన్నారు. డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణమోహన్ మాట్లాడుతూ 2012-13 సంవత్సరంలో సంఘాల నుండి సేకరించిన పాలకు లీటర్‌కు 20పైసలు చొప్పున ప్రోత్సాహబహుమతినిస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది వృద్ధిరేటు 9.3శాతం పెరిగిందన్నారు. డెయిరీలో కొత్తగా పాలు స్టోరేజ్‌కు కావాల్సిన స్టెయిన్‌లెస్ స్టీల్ ట్యాంకులు, ఇతర పాలపదార్థాలు నిల్వచేసేందుకు కావాల్సిన మిషనరీని కొనుగోలు చేసినట్లు వెల్లడించారు.

### కాంగ్రెస్‌కే మూడు డైరెక్టర్ స్థానాలు

మంగళవారం పాలకవర్గంలోని మూడు డైరెక్టర్ల స్థానాలకు ఎన్నికలు జరగగా, వీటి కోసం ఐదుగురు పోటీపడ్డారు. వీరిలో కాంగ్రెస్‌పార్టీకి చెందిన కొండ్రెడ్డి రంగారెడ్డి వర్గీయులు అల్లూరు మండలం ఇందుపూరు సొసైటీ అధ్యక్షుడు ఏటూరు శ్రీనివాసులురెడ్డి, ఇందుకూరుపేట మండలం కొరుటూరు సొసైటీ అధ్యక్షుడు రావిళ్ల వెంకటేశ్వరప్రసాద్, నాయుడుపేట మండలం మేనకూరు సొసైటీ అధ్యక్షుడు కట్టా భవానీశంకర్‌రెడ్డిలు డైరెక్టర్లుగా గెలిచారు.

## సతీష్‌రెడ్డికి ప్రతిష్టాత్మక అవార్డు



భారతదేశం గర్వించదగ్గ ప్రఖ్యాత శాస్త్రవేత్త ప్రొఫెసర్ హోమి జె.బాబా జ్ఞాపకార్థం 1989లో ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోషియేషన్ ప్రవేశపెట్టిన ప్రతిష్టాత్మక అవార్డు నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం మహిమలూరు వాస్తవ్యులైన ప్రముఖ శాస్త్రవేత్త రక్షణవ్యవస్థ పరిశోధన అభివృద్ధి సమాఖ్య(డి.ఆర్.డి.ఓ) పరిశోధనా కేంద్రం "ఇమారత్" డైరెక్టర్ జి.సతీష్‌రెడ్డిని వరించింది. 2014, ఫిబ్రవరి 3న జమ్మూలో జరుగనున్న 101వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ వార్షిక సమావేశంలో ప్రధానమంత్రి డా॥మన్మోహన్‌సింగ్ చేతులమీదుగా ఆయన ఈ అవార్డును అందుకోనున్నారు. రెండేళ్ళకోసారి ప్రదానం చేసే ఈ అత్యుత్తమ అవార్డును గతంలో ఆటమిక్ ఎనర్జీ కమీషన్ వ్యవస్థాపక కార్యదర్శి డా॥అనిల్ కందోద్కర్, నేషనల్ అకాడమీ ఆఫ్ ఇంజనీరింగ్ అధ్యక్షులు డా॥ బాలదేవ్‌రాజ్, డిపార్ట్‌మెంటు ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ వ్యవస్థాపక కార్యదర్శి వీఎస్ రామమూర్తి వంటి ఉద్దండులు మాత్రమే అందుకొని వున్నారు. నేడు వారి సరసన మన జిల్లాకు చెందిన యువ శాస్త్రవేత సతీష్‌రెడ్డి చేరడం మనకందరికీ గర్వకారణం. ఆయనకు "లాయర్" శతాధిక శుభాభినందనలు తెలుపుతోంది.


## జీవో రద్దు చేయండి



కండలేరు జలాశయం నుంచి చిత్తూరుకు నీటిని తరలించే జీవోను వెంటనే రద్దు చేయాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కోరారు. మంగళవారం నెల్లూరు జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్‌ను కలసి వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ నీటి తరలింపుతో నెల్లూరు జిల్లా రైతులకు తీవ్రనష్టం కలుగుతుందని, కృష్ణపట్నం వద్ద రిలయన్స్ పవర్‌ప్రాజెక్ట్ నిర్మాణం కోసం భూసేకరణ చేసారని వెంటనే ప్రారంభించేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

### జగన్ సమక్షంలో...

## వైకాపాలో చేరిన చేవూరు బాలకృష్ణారెడ్డి



వై.యస్.జగన్‌కు జ్ఞాపికనందజేస్తున్న చేవూరు బాలకృష్ణారెడ్డి

యువ వ్యాపారవేత్త, నెల్లూరీయుడు చేవూరు బాలకృష్ణారెడ్డి ఈ నెల 9వ తేదీన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వైయస్సార్ జిల్లా పులివెందులలో వైకాపా అధ్యక్షులు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి సమక్షంలో ఆయన వైయస్సార్ కాంగ్రెస్‌లో చేరడం జరిగింది. 50వాహనాలలో తరలివచ్చిన అనుచరులతో ఆయన వైకాపా జెండా పట్టారు. బాలకృష్ణారెడ్డితో పాటు ఆయన పెద్దనాన్న, ఎంపి మేకపాటి రాజమోహన్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు చేవూరు వెంకట్రామిరెడ్డి కూడా వైయస్సార్ కాంగ్రెస్‌లో చేరారు. జగన్‌కు అత్యంత ప్రీతిపాత్రుడు బాలకృష్ణారెడ్డి. వివాదరహితుడిగా, అందరినీ కలుపుకుపోయే మృదుస్వభావిగా ఆయనకు మంచి పేరుంది. బెంగుళూరు కేంద్రంగా 2009లో వైయస్సార్ మెమోరియల్ ఫౌండేషన్‌ను స్థాపించి దాని కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఏడాది జూన్ 21, 22, 23 తేదీల్లో బెంగుళూరులోని మెట్రో మార్వెల్ గార్డెన్స్‌లో జగన్ విడుదల కోరుతూ 150మంది అర్చకులతో చండీయాగాన్ని నిర్వహించారు. జగన్ చిన్నాన వై.యస్.వివేకానందరెడ్డి, పిన్నమ్మ, వై.వి.సుబ్బారెడ్డి సతీమణి స్వర్ణమ్మ, నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డిలు కూడా ఈ చండీయాగంలో పాల్గొన్నారు. వైకాపాలో చేరిన బాలకృష్ణారెడ్డిని జగన్ అభినందిస్తూ, నేటి రాజకీయాలకు కావాల్సింది నిస్వార్థపరులైన ఇలాంటి నాయకులేనని, పార్టీ పురోభివృద్ధికి నిరంతరం పాటు పడాలని ఆకాంక్షించారు.

PDF Compressor Free Version






## మరి 'నోటా' ఎందుకు?

వచ్చే ఎన్నికల్లో బ్యాలెట్‌లో తిరస్కరణ ఓటు చేరుస్తామని ఎన్నికల సంఘం ప్రకటించింది. అయితే తిరస్కరణ ఓట్లు అభ్యర్థుల కంటే ఎక్కువ వచ్చినప్పుడు పోటీలో వున్న అభ్యర్థులందరినీ అనర్హులుగా ప్రకటించాలి. కాని తిరస్కరణ ఓట్లు ఎక్కువొచ్చినా పోటీలో ఉన్న అభ్యర్థులలో ఎవరికి ఎక్కువ ఓట్లు వస్తే వాళ్ళని విజేతగా ప్రకటిస్తామన్నారు. ఈ మాత్రందానికి తిరస్కరణ ఓటు చేర్చడం ఎందుకు?

సి. రాంప్రకాష్, చెన్నై.

## ఉపయోగముందా?

'ఇస్రో' ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అంగారక పరిశోధన యాత్ర వల్ల నిజంగానే ప్రయోజనముందా? దీని కోసం 450కోట్ల రూపాయలు ఖర్చుపెట్టారు. ఇప్పటికే 'నాసా' అంగారకగ్రహంపై పరిశోధనలు పూర్తి చేసి అక్కడ ఏమీ లేదని తేల్చింది. అంతరిక్ష ప్రయోగాలు మన దేశానికి ఉపయోగపడేటట్లుంటే బాగుంటుంది.

ఎస్.కె. ఖాదర్, నెల్లూరు.

## ఎవరు ఎటో తెలియదు!

తన ఆధిపత్యం లేకుంటే కేసీఆర్‌కు తెలంగాణ అక్కరలేదు. సమైక్యవాదులకు హైదరాబాద్ ఇస్తే ఉద్యమం ఆగుతుంది. చంద్రబాబుది సీమాంధ్రలో సమైక్యం, తెలంగాణలో విభజనవాదం. జగన్‌కు సమైక్యాంధ్ర ఉద్యమం కావాలి, రాష్ట్రం మాత్రం విడిపోవాలి. కిరణ్ కాంగ్రెస్ విధేయుడు. కాంగ్రెస్ నుండి బయటకొస్తే పెద్దనాయకుడు కాడు. బొత్స సత్యనారాయణ సీమాంధ్రలో వున్న విభజనవాది. ఎవరిది ఏ వాదమో అర్థంకాక జనం జుట్లు పీక్కుంటున్నారు.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

## ఆ ఆలోచన బాగుంది!

కాంగ్రెస్, బీజేపీలు కలిసి జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్న బీజేపీ ఎంపీ శతృఘ్న సిన్హా సూచన బాగుంది. దీనివల్ల సుస్థిర ప్రభుత్వాలు ఏర్పడతాయి. ప్రాంతీయ పార్టీల ప్రభావం తగ్గి, అసమానతలు తలెత్తవు.

జి.వి. శంకర్, గూడూరు.

## 'ప్రభా'తం

# చరిత్రను మార్చలేం!



**గతించిన చరిత్రను మనం మార్చలేకపోవచ్చు. కాని జరుగుతున్న కాలాన్ని మార్చొచ్చు. మన తప్పులను సరిదిద్దుకోవచ్చు. భరతదేశ చరిత్రలో తెలుగుజాతి తనను విద్రోహురాలిగా, జాతిని చీల్చిన పాపాత్మురాలిగా తిట్టుకోకూడదు అను కుంటే సోనియాగాంధీ ఈరోజే దానిని సరిదిద్దుకోవాలి.**

చరిత్ర శాశ్వతం... చరిత్రలో అక్షరాలు శాశ్వతం... వాటినెవరూ మార్చలేరు. గతించిన కాలాన్ని ఎవ్వరూ తిరిగితేలేరు. చేసిన తప్పులను ఎవరూ సరిదిద్దలేరు. చరిత్ర మనముందు ఎన్నో ఆనవాళ్ళను నిలిపింది. మంచితనాన్ని ముందుంచింది, దుర్మార్గాన్ని కళ్లకు కట్టింది. చెడుతో ప్రపంచాన్ని జయించాలని చూసిన హిట్లర్ చరిత్రలో విలన్‌గా ఉండిపోతాడేగాని, హీరోగా మారలేడు. నెపోలియన్ అంతే. దురాక్రమణదారుడు ఔరంగజేబును మనం గొప్ప పరిపాలకుడిగా చదువుకోగలమా?

అలాగే ప్రజలను తన కన్నబిడ్డల్లా పాలించిన శ్రీరామచంద్రుడిని ఈ చరిత్ర హీరోగా చూపించిందేగాని విలన్‌గా చూపలేదు కదా! దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన జాతిపిత గాంధీజీకి ఈ చరిత్రలో మహాత్ముడిగా చోటుందేగాని విలన్‌గా చూపలేరు కదా! ఒకప్పుడు జరిగింది ఇప్పుడు చరిత్రగా వుంది. ఇప్పుడు జరిగేది రేపటితరానికి చరిత్రగా మారుతుంది. భావితరాలు చదువుకోబోయే చరిత్ర పాఠాలలో స్వార్థరాజకీయాల కోసం, పదిసీట్లకు కక్కుర్తిపడి పచ్చగా వున్న తెలుగుజాతిని విడగొట్టిన మహా దుర్మార్గురాలు సోనియాగాంధీ అనేది అక్షర రూపమైతే... అలాంటి చరిత్ర అవసరమా? అలాంటి చరిత్రను మనం ఎవరిమైనా మార్చగలమా? ఈ తెలుగుగడ్డ మీద పుట్టే ప్రతిబిడ్డ కూడా సోనియాగాంధీని తిట్టుకోకుండా వుంటుందా? ఈ భూమ్మీద సోనియా గాంధీ శాశ్వతం కాదు. ఇప్పుడున్న ఏ ఒక్కరూ శాశ్వతం కాదు. పాత నీరు పోతుంటుంది, కొత్తనీరు వస్తుంటుంది. కాని ఎప్పటికప్పుడు చరిత్ర శాశ్వతంగా వుంటుంది. రావణాసురుడు, నరకాసురుడు, హిరణ్యకశిపుడు, ఔరంగజేబు, హిట్లర్, నెపోలియన్... వేల, వందల సంవత్సరాలచరిత్ర వీరిది. కాని వీరి దుర్మార్గాలను ఇప్పటికీ మరచిపోలేదు. అలాగే ఈరోజు సోనియాగాంధీ చేస్తున్న దుర్మార్గాన్ని కూడా తెలుగుజాతి తరతరాలకు మరచిపోదు.

తెలంగాణ వచ్చాక గుజరాత్‌లో సర్దార్‌వల్లభ్‌భాయ్‌పటేల్ విగ్రహం కంటే ఎత్తైన సోనియాగాంధీ విగ్రహాన్ని తెలంగాణలో పెడతామని ఇటీవల ఓ కాంగ్రెస్ నాయకుడు చెప్పారు. నాయకుల ఔన్నత్యాన్ని కొలవాల్సింది విగ్రహాల ఎత్తులో కాదు, వారి దక్షతలో. సోనియాకు పటేల్‌కు పోలిక పెట్టడమంటే నక్కకు నాగలోకానికి పొంతన పెట్టడమే. దేశహితం కోసం, దేశ సమైక్యత కోసం దేశంలోని 564 సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసిన ఉక్కుమనిషి పటేల్ ఎక్కడ? ముష్టి పది ఎంపీ సీట్ల కోసం పచ్చగా వున్న రాష్ట్రాన్ని విడదీసిన సోనియా ఎక్కడ?

గతించిన చరిత్రను మనం మార్చలేకపోవచ్చు. కాని జరుగుతున్న కాలాన్ని మార్చొచ్చు. మన తప్పులను సరిదిద్దుకోవచ్చు. భరతదేశ చరిత్రలో తెలుగుజాతి తనను విద్రోహురాలిగా, జాతిని చీల్చిన పాపాత్మురాలిగా తిట్టుకోకూడదు అనుకుంటే సోనియాగాంధీ ఈరోజే దానిని సరిదిద్దుకోవాలి. రాష్ట్రాన్ని చీలిస్తే వచ్చే 10సీట్లతో యూపీఏ మళ్ళీ అధికారంలోకి వచ్చేది లేదు. రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అయ్యేది లేదు. కాని ఈరోజు చేసే ఒక చారిత్రాత్మక తప్పుకు తరతరాలు బలవుతాయి. భావితరాలు ఆమెకే శాపనార్థాలు పెడుతుంటాయి. తెలంగాణ ఇస్తే అక్కడ సోనియాగాంధీ శిలావిగ్రహాలు పెట్టొచ్చు. కాని సీమాంధ్రలో ప్రతి ఇంట సోనియా శవవిగ్రహాలను పెట్టుకుంటారు. రేపు తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సోనియాగాంధీని మహా అంటే ఓ ఐదేళ్లు గుర్తుపెట్టుకుంటారు. కాలం మారేకొద్దీ మరచిపోతుంటారు. చేసిన మంచిని మరచిపోవడానికి చాలా తక్కువ సమయం పడుతుంది. కాని ప్రజలు చెడును అంత తొందరగా మర్చిపోరు. సీమాంధ్రలో తరతరాలు సోనియాగాంధీని ఒక విలన్‌గానే చూస్తాయి.

ఒక ప్రాంతం ప్రజల మనసుల్లో దుర్మార్గురాలిగా ముద్రపడడం సోనియాకు అవసరమా? నెహ్రూ, ఇందిర, రాజీవ్‌లకు భారతదేశ చరిత్రలో సమున్నత స్థానం వుంది. దేశంలోని ఏ ప్రాంత ప్రజల దృష్టిలో కూడా వాళ్ల విలన్‌లు కాలేదు. వాళ్లహయాంలో వివిధ రాష్ట్రాల ఏర్పాటు జరిగినా అవి స్థానిక ప్రజల అంగీకారంతోనే జరిగాయి. కాని ఈరోజు ఆంధ్రప్రదేశ్ విభజనను అలా చేయడం లేదు. ఆరుకోట్ల సీమాంధ్రుల మనోభావాలను గాయపరుస్తున్నారు. వారి బ్రతుకులను, వారి బిడ్డల భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేస్తున్నారు. ఓట్లు, సీట్ల కక్కుర్తితో చరిత్ర కూడా క్షమించని నేరానికి, ద్రోహానికి సోనియా పాల్పడుతుంది. ఈ చీలికపాపంలో ఎందరో పాత్రధారులుంటారు. కాని వాళ్ళెవరూ భావితరాలకు గుర్తుండరు. ఒక్క సోనియానే విద్రోహురాలిగా ఈ చరిత్ర గుర్తుంచుకుంటుంది.

## 'అంతర్'జాతీయం

- కొలంబోలో జరిగే చోగమ్ సదస్సుకు ప్రధాని మన్మోహన్‌సింగ్ వెళ్లలేదు. ఆయన బదులు విదేశీ వ్యవహారాల శాఖమంత్రి సల్మాన్‌ఖుర్షీద్ హాజరయ్యారు. తమిళపార్టీల ఒత్తిడి మేరకే ప్రధాని ఈ నిర్ణయం తీసుకున్నాడు.
- పాకిస్థాన్ బాలికా హక్కుల పోరాట యోధురాలు యూసఫ్‌జాయ్ మలాలా వ్రాసిన 'ఐయాంమలాలా' పుస్తకాన్ని పాకిస్థాన్‌లోని ప్రైవేట్ పాఠశాలలు నిషేధించాయి. పాశ్చాత్య దేశాల చేతుల్లో మలాలా కీలుబొమ్మగా మారిందని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని అఖిల పాకిస్థాన్ ప్రైవేట్ పాఠశాలల సమాఖ్య ఒక ప్రకటనలో తెలిపింది.
- వెనుజువెలాకు చెందిన టీవీ వ్యాఖ్యాత గేబ్రియాలా ఐలర్(25) విశ్వసుందరి కిరీటాన్ని దక్కించుకుంది. ఈ నెల 9వ తేదీ రాత్రి మాస్కోలో అట్టహాసంగా జరిగిన తుదిపోటీల్లో 85దేశాల అందగత్తెలను ఓడించి ఆమె ఈ టైటిల్‌ను సాధించింది.
- ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన ప్రభావవంతమైన సిక్కుగా ప్రధాని మన్మోహన్‌సింగ్ తొలిస్థానంలో నిలిచారు. ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు మాంటెక్ సింగ్ అహ్లూవాలియా రెండోస్థానంలో నిలిచారు.
- ఫిలిప్పీన్స్‌ను 'హయాన్' తుఫాన్ గడగడలాడించింది. ఆ దేశాన్ని అతలాకుతలం చేసేసింది. ఈ తుఫాన్ ధాటికి ఆ దేశంలో 12వేల మందికిపైగా ప్రజలు మరణించారని అంచనా! లేట్‌ప్రావిన్స్ రాజధాని టుక్లోబన్ నగరం శవాలదిబ్బగా మారింది. 275 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలుల ధాటికి సముద్రంలోని ఓడలు సైతం నగరంలోకి దూసుకొచ్చాయి.
- వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీఎస్పీ సొంతంగానే పోటీ చేస్తుందని, ఏ పార్టీతోనూ పొత్తులుండవని ఆ పార్టీ అధినేత్రి మాయావతి స్పష్టం చేసింది.
- వచ్చే పదేళ్లలో భారత్ విజ్ఞానశక్తిగా ఎదగాలని రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఆకాంక్షించారు. 11వ తేదీ గ్యాంగ్‌టాక్‌లో 40వ జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ శాస్త్ర గణిత, పర్యావరణ సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడుతూ దేశంలో ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలని, అట్టడుగు వర్గాలకు చదువు మరింత చేరువ కావాల్సి వుందన్నారు.
- న్యాయవ్యవస్థలో పారదర్శకత పెంచేందుకు కోర్టు విచారణలను వీడియో రికార్డింగ్ చేయాలని కేంద్ర న్యాయశాఖ మంత్రి కపిల్‌సిబల్ ప్రతిపాదించారు. క్రింది కోర్టులు హైకోర్టుల క్రింద పనిచేస్తున్నందున వీడియోరికార్డింగ్‌పై ఉన్నత న్యాయవ్యవస్థతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు.
- దేశ రాజధాని ఢిల్లీలో 12వ తేదీ మూడుగంటల వ్యవధిలో నాలుగుసార్లు భూమి కంపించింది. సోమవారం అర్ధరాత్రి దాటాక ఈ ప్రకంపనలు సంభవించాయి. అయితే ప్రకంపనల తీవ్రత తక్కువగా వుండడంతో నష్టం వాటిల్లలేదు.

## వార్త వ్యాఖ్య

వార్త :- నెలరోజుల్లో తెలంగాణ బిల్లు పెట్టాలి. - మంద కృష్ణ డిమాండ్.
వ్యాఖ్య :- *ఆ తర్వాత పెడితే వద్దంటారా?*

వార్త :- సమైక్యాంధ్ర కోసం అవసరమైతే ప్రత్యక్ష పోరాటం. - మంత్రి శైలజానాథ్.
వ్యాఖ్య :- *ఇప్పుడు అవసరం లేదనుకుంటున్నారా?*

వార్త :- సీఎం రేసులో లేను. - మంత్రి రఘువీరా.
వ్యాఖ్య :- *మూడునెలల ముచ్చటకి మళ్ళీ రేసొకటా?*

వార్త :- ఇటాలియన్ బిడ్డల్లా వ్యవహరిస్తున్నారు. - వైకాపా నేత వాసిరెడ్డి పద్మజ.
వ్యాఖ్య :- *పార్టీ అధ్యక్షురాలి పోకడలు అబ్బివుంటాయి.*

వార్త :- కాంగ్రెస్ కార్యాలయంపై చెప్పుల వర్షం. - ఢిల్లీలో విశాలాంధ్ర మహాసభ ప్రతినిధుల దాడి.
వ్యాఖ్య :- *అక్కడున్న కాంగ్రెస్‌నేతలకు చెప్పులు కొనుక్కునే పనిలేకుండా చేశారు.*

వార్త :- విభజనకు నేను అంగీకరించలేదు. - కిరణ్.
వ్యాఖ్య :- *మీ అంగీకారంతో వాళ్లకు పనేముంది.*

వార్త :- జనవరి 1న కొత్త రాష్ట్రం. - కేంద్రమంత్రి జైపాల్‌రెడ్డి.
వ్యాఖ్య :- *ఏప్రిల్ 1న ఏర్పాటు చేస్తే ఇంకా బాగుంటుందేమో... అందరినీ ఫూల్స్ చేసి ఏర్పాటు చేస్తున్నారుగా!*

వార్త :- రాష్ట్ర విభజనకు గుడ్డిగా మద్దతివ్వం. - బీజేపీ నేత వెంకయ్య.
వ్యాఖ్య :- *చివరకు మీరు చేయబోయేది అదే లాగుంది.*

వార్త :- రాష్ట్రం ముక్కలైతే మారేది సరిహద్దులే. - జేపీ.
వ్యాఖ్య :- *పార్టీల తలరాతలు కూడా!*

వార్త :- కాంగ్రెస్‌లో విలీనం ఉండదు. - కేసీఆర్.
వ్యాఖ్య :- *ఈ మాత్రం దానికి కాంగ్రెస్ అంత రిస్క్ చేయడమెందుకు?*

వార్త :- రాజ్యాంగబద్ధంగా ఉంటేనే మద్దతు. - ఏపీఎన్జీఓలకు రాజ్‌నాథ్ హామీ.
వ్యాఖ్య :- *ఇప్పుడు జరిగేదంతా రాజ్యాంగబద్ధంగా ఉందనుకుంటున్నారా?*

వార్త :- మా హయాంలోనే తెలంగాణబిల్లు. - షిండే.
వ్యాఖ్య :- *బిల్లు మాత్రమే, తెలంగాణ కాదు.*

వార్త :- సీమాంధ్ర కేంద్రమంత్రులు దద్దమ్మలు. - ఎమ్మెల్సీ అడుసుమిల్లి.
వ్యాఖ్య :- *జనాలకు తెలిసిన విషయాన్ని మీరు ఆలస్యంగా తెలుసుకున్నారు.*

వార్త :- అదృష్టం ఉంటే సీఎం కావచ్చు. - మంత్రి పితాని.
వ్యాఖ్య :- *ఇప్పుడున్న పరిస్థితుల్లో దరిద్రం పట్టినవాళ్లే సీఎం అవుతారు.*

PDF Compressor Free Version



# రూల్స్ మార్చినా... రూట్‌లో పడేనా?

- అతిక్రమిస్తే భారీ జరిమానాలు
- లైసెన్స్ లేని డ్రైవర్లకు ఆటోలిస్తే యజమానులకు అధోగతి
- మద్యంతాగి బండితోలితే శ్రీకృష్ణ జన్మస్థానమే..
- డిసెంబర్ 1 నుంచి పకడ్బందీగా అమలు

## బీ...అలర్ట్..

ఇలాంటి ట్రాఫిక్ నిబంధనలు గతంలో ఎన్నోసార్లు ప్రకటించినా అమలు చేసిన పాపాన పోలేదు. ఏదైనా సమస్య వస్తే ఆర్భాటంగా ప్రకటించడం.. రోజులు గడిచే కొద్ది ఉదాసీనంగా వ్యవహరించడం పరిపాటయ్యింది. పోలీసులు అడ్డదారులు తొక్కకుండా తప్పు చేసిన వారిని ఉపేక్షించకుండా కఠినంగా క్రమ శిక్షణతో వ్యవహరిస్తే ట్రాఫిక్ సమస్యలుండవ్, తప్పు చేయాలన్నా ప్రజలు భయపడతారు. నగరంలో అక్కడక్కడా ప్రధాన సెంటర్ల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటుచేసి ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన వాహనదారులపై భారీగా జరిమానా విధిస్తే తప్ప సమస్య కొలిక్కిరాదు. మరలా పోలీసులు కొత్త ట్రాఫిక్ నిబంధనలు అమల్లోకి తేనున్నారు. నెల్లూరు జిల్లాలో వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పక్కాగా పాటించేలా పోలీసులు చర్యలు చేపడుతున్నారు. ఈ మేరకు నిబంధనలు అతిక్రమిస్తే వారిపై భారీగా అపరాధ రుసుములు విధించేందుకు నిర్ణయం తీసుకుంటున్నారు. డిసెంబర్ నెల 1న తేదీ నుండి పక్కాగా కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకురానున్నారు. ఎవరైనా గీత దాటి పట్టుబడితే వేల రూపాయల్లో అపరాధ రుసుములు వసూలుకు రెడీ అవుతున్నారు. ప్రభుత్వం పలురకాల ట్రాఫిక్ ఉల్లంఘనలకు రుసుములు పెంచుతూ 2011 ఆగష్టులో జీవోనెం 108 ఉత్తర్వులు జారీ చేసివుంది. కాని దీని అమలుపై పోలీసులు కఠిన నిర్ణయాలు తీసుకోకుండా ఇంతకాలం పాత రుసుములే వసూలు చేస్తున్నారు. డిసెంబర్ 1 నుంచి ఖచ్చితంగా కొత్త నిబంధనలు అమలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. వాహనదారులు ఇకపై నిబంధనలు తప్పక పాటించాల్సిందే. రోడ్డు నిబంధనలు పదే పదే ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి ఉల్లంఘనదారుల వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తారు. నెల్లూరు జిల్లా కేంద్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నందు వల్ల ఇతర ప్రాంతాలు, రాష్ట్రాలు దృష్టి నెల్లూరుపై పడింది. అంతే కాకుండా ఇతర రాష్ట్రాలు, జిల్లాల దొంగలు, దోపిడీదారులు, నేరస్తులు నెల్లూరు కేంద్రంగా చేసుకుని అనేక నేరాలకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో నేరాల నియంత్రణకు పూర్తి స్థాయిలో సహకరించే సిసి కెమెరాలు ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. నగరంలోని ముఖ్య కూడళ్ళు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలతోపాటు ప్రధాన ప్రాంతాల్లో అమర్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

**మద్యంతాగి బండి నడిపితే:**

మద్యంతాగి వాహనాలు నడిపి పోలీసుల డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడితే రూ.2000/- జరిమానాతోపాటు ఆరు నెలలు జైలుశిక్ష విధించే అవకాశం ఉంది.

**ఆటో యజమానులపైనా కేసులు:**

ఆటో యజమానులు ఎవరైనా లైసెన్స్‌లు లేని డ్రైవర్లకు ఆటోలను రోజువారీ బాడుగకు ఇస్తే వారు పోలీసులకు తనిఖీల్లో చిక్కితే ఆటో డ్రైవర్లతోపాటు ఆటో యజమానికి రూ. 1000/-లు జరిమానా విధిస్తారు.

**సెల్ ఫోన్లో మాట్లాడుతూ బండీనడిపితే:**

ఎవరైనా సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ బండి నడిపితే ఖచ్చితంగా రూ. 1000/-లు జరిమానా కట్టాల్సిందే. పోలీసులు ఆపినా ఆగకుండా వెళ్ళి పట్టుపడితే రూ. 3000/-లు జరిమానా.

ఫాస్ట్ డ్రైవింగ్ చేస్తే రూ. 1000/-లు జరిమానా, సీటు బెల్టు లేకుండా, హెల్మెట్ లేకపోతే రూ. 1000/-లు జరిమానా.

సైలెన్సర్ లేకపోతే రూ. 1000/-లు జరిమానా, బైక్‌పై ఇద్దరికంటే ఎక్కువ మంది ప్రయాణిస్తే రూ. 250/-లు జరిమానా విధిస్తారు. కాబట్టి బీ....అలర్ట్.

# మైనార్టీల అభివృద్ధికి ప్రత్యేక కృషి

## నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకా



ఇందిరమ్మ ఆశయాలకు తగ్గట్టుగా మైనార్టీలకు వివిధ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి పేర్కొన్నారు. సోమవారం నెల్లూరు నగరంలోని షాదీమంజిల్‌లో మౌలానా అబ్దుల్‌కలాం ఆజాద్ జయంతి సందర్భంగా మైనారిటీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనం వివేకానందరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఓట్ల కోసం మతతత్వాన్ని రెచ్చగొట్టే వారికి తగిన బుద్ధి చెప్పాలని, రాష్ట్రాన్ని మరో గుజరాత్‌లా మార్చేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయన్నారు. కాంగ్రెస్‌పార్టీ హయాంలోనే ముస్లీంల అభివృద్ధికి పెద్దపీట వేశామన్నారు. ఈనెల 16వతేదీ 11కోట్లతో బారాషాహీద్ మాస్క్ ముజఫర్‌ఖాన్ నిర్మాణానికి శంఖుస్థాపన చేస్తున్నట్లు తెలిపారు. నెల్లూరు నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి మాట్లాడుతూ మైనార్టీ విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా అనేక పథకాలను ప్రవేశపెట్టామన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సంక్షేమశాఖ ఈడి మహ్మద్‌షంషుద్దీన్, షఫీ నిస్సార్, అబూబకర్, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా సాగిన మహిళల క్రీడా పోటీలు

ఇటీవల కోట మండల విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాల క్రీడా మైదానంలో ఈనెల విక్రమసింహపురి విశ్వవిద్యాలయంలో క్రీడాపోటీలు జరుగగా ఈనెల 10న విజయం సాధించిన విజేతలకు బహుమతి ప్రదానం జరిగింది. హ్యాండ్ బాల్‌లో, టెన్నికాయిట్‌లో, ఎన్‌బికెఆర్, బాస్కెట్‌బాల్, ఖోఖో, కబడ్డీలో వీఆర్‌సి జట్లు గెలుపొందాయి. బాల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, టేబుల్‌టెన్నిస్(డబుల్స్), వాలీబాల్‌లో డికెడబ్ల్యు జట్లు విజయం సాధించాయి. వీరికి వీఎస్‌యూ స్పోర్ట్సు కార్యదర్శి చంద్ర మోహన్, కళాశాల మేనేజర్ రామకృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ రాజగోపాల్‌రెడ్డిలు బహుమతులు అందించారు. కార్యక్రమంలో స్పోర్ట్సు ఆర్గనైజర్ కార్యదర్శి అమ్మాజీ, కోఆర్డినేటర్ డాక్టర్ రాజా, ఎన్‌బికెఆర్ బిఎస్సీ పీడి మల్లికార్జునరెడ్డి, అధ్యక్షులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# పేద బ్రాహ్మణ విద్యార్థుల ఆర్థికసాయానికి ధరఖాస్తులు

గత 5 సంవత్సరాలుగా పేద బ్రాహ్మణ విద్యార్థినీవిద్యార్థుల ఉన్నతవిద్యకై ఆర్థికసాయం చేస్తున్న నెల్లూరు బ్రాహ్మణ మహాసభ ఈ సంవత్సరం కూడా అర్హతగల విద్యార్థుల నుండి దరఖాస్తులు కోరుతుంది. ఈ నెల 15 నుండి 25వ తేదీలోగా పేద బ్రాహ్మణ విద్యార్థుల దరఖాస్తులు స్వీకరించబడతాయని, వివరాలకు మహాసభ అధ్యక్షులు రాళ్లపల్లి రామసుబ్బారావు (9908269665), కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ వై.నాగదేవిప్రసాద్(9440164423)లను సంప్రదించాలని లేదా www.nellorebrahmins.com అను వెబ్‌సైట్ నుండి వివరాలను పొందవచ్చని మహాసభ ఒక ప్రకటనలో పేర్కొంది.

# బోగస్ కార్డులను తొలగించాలి



బుచ్చిరెడ్డిపాళెం నీటిపారుదలశాఖ బంగ్లాలో ఈనెల 10న కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సమైక్యాంధ్రకు కట్టుబడి పదవికి రాజీనామా చేసినందున రచ్చబండలో పాల్గొనడం లేదని, వైస్సార్సీపీ తరపున సర్పంచ్‌లు పాల్గొని రేషన్‌కార్డులు, పింఛన్లు, ఇళ్ళ గురించి అధికారులను నిలదీయాలని అన్నారు. కోవూరు నియోజకవర్గంలో 5మండలాలలో 8,240 మందికి రేషన్‌కార్డులు, 3114 మందికి పింఛన్లు, 5184 మందికి ఇళ్ళు మంజూరు అయ్యాయని తెలిపారు. విడవలూరు మండలం వీఆర్వో రేషన్‌డీలర్లతో కుమక్కై 243 బోగస్‌కార్డులకు కారకుడయ్యాడన్నారు. ఈవిషయాన్ని జిల్లా కలెక్టర్ శ్రీకాంత్‌కు ఫిర్యాదు చేయగా విచారణ చేయాల్సిందిగా ఆర్డీఓను ఆదేశించారన్నారు. విడవలూరు మండలం ముదివర్తికి చెందిన 243 బోగస్ కార్డులను తొలగించాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో వైస్సార్సీ పార్టీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త పాశం సునీల్‌కుమార్, మండల కన్వీనర్ టంగుటూరు మల్లికార్జునరెడ్డి, నేతలు ఏసుగు ఇంద్రసేనారెడ్డి, ఇప్పగుంట విజయభాస్కర్‌రెడ్డి, చీమల రమేష్‌బాబు, అల్లాభక్షు, కోడూరు మధుసూదన్‌రెడ్డి, వవ్వేరు బ్యాంకు ఛైర్మన్ సూరా శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ అధికారుల సమస్యలపై కలెక్టర్ హామీ

రెవెన్యూ అధికారుల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని నెల్లూరు జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ హామీ ఇచ్చారని రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వై.మధుసూదన్‌రావు తెలిపారు. మంగళవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో అసోసియేషన్ ప్రతినిధులు సమావేశమయ్యారు. మధుసూదన్‌రావు మాట్లాడుతూ ఆత్మకూరు, నాయుడుపేట రెవెన్యూ డివిజన్లలో సిబ్బందిని నియమించడంతో పాటు డీటీ ప్యానెల్ జాబితాను సీసీఎల్‌ఏకు పంపాలని కోరామన్నారు. తహశీల్దార్లు వినియోగిస్తున్న వాహనాలకు బడ్జెట్ మంజూరు చేయాలన్నారు. చేజర్ల, చిల్లకూరు, జలదంకి మండలాల్లో తహశీల్దార్ కార్యాలయాలు నిర్మించాలన్నారు, కలెక్టరేట్, తహశీల్దార్ కార్యాలయాలకు కొత్త కంప్యూటర్లను మంజూరు చేయాలని కలెక్టర్‌ను అడిగినట్లు తెలిపారు. సమస్యలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కాయల సతీష్‌కుమార్ కోశాధికారి దగ్గుపాటి శ్రీరామకృష్ణ పాల్గొన్నారు.

# వియస్‌యు బస్సుకు 26వేలు జరిమానా

నెల్లూరు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంకు చెందిన బస్సుకు ఆర్టీఏ అధికారులు 26వేలు జరిమానా విధించారు. విద్యార్థుల సౌకర్యార్థం విశ్వవిద్యాలయం వారు 14లక్షలతో నూతన బస్సును కొనుగోలు చేసారు. కాని ఇప్పటి వరకు బస్సుకు రిజిస్ట్రేషన్, నెంబరు లేకపోవడంతో రవాణాశాఖ అధికారులు బస్సుకు జరిమానా విధించి ఆర్టీసీ బస్టాండులో ఉంచారు. త్వరలో జరిమానా కట్టి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని అధికారులకు సూచించారు.

# బారాషాహిద్ దర్గా హుండీ ఆదాయం 5లక్షలు

నెల్లూరు నగరం దర్గామిట్టలోని బారాషాహిద్ దర్గాకు ఏడాది హుండీ ఆదాయం 5లక్షల 17వేల 95రూపాయలు లభించింది. బారాషాహిద్ దర్గాలోని ఎర్రదర్గాలో నెల్లూరు తహశీల్దార్ నరసింహులు, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ షేక్ హైదరబాషా ఆధ్వర్యంలో మంగళవారం 4హుండీలను లెక్కించారు. గతంలో 4.20లక్షల ఆదాయం రాగా ప్రస్తుతం 5లక్షలకు పైగా ఆదాయం వచ్చింది. హుండీల లెక్కింపు ఉదయం నుండి రాత్రి వరకు జరిగింది. మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

# విద్యుత్ సంఘం నూతన కమిటీ

నెల్లూరులోని సిపియం పార్టీ కార్యాలయంలో ఈనెల 10న ప్రొవిన్సియల్ విద్యుత్ ఉద్యోగుల జిల్లా సదస్సు జరిగింది. సదస్సులో పాల్గొన్న యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు దుగ్గిరాల సూరిబాబు మాట్లాడుతూ విద్యుత్‌రంగంలోని ఉద్యోగులను ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న కార్మికులతో నింపాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగులపై పనిభారం పెరిగి మానసికఒత్తిడిని గురవుతున్నారని, గత పది ఏళ్ళ కాలంగా తక్కువ వేతనంతో కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ కార్మికులు పని చేస్తున్నారని, వీరందరినీ క్రమబద్ధీకరించాలని అన్నారు. తదుపరి జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ కన్వీనర్‌గా పి.బాబు రిచర్డ్సన్, కోకన్వీనర్లుగా ఎస్.కె. ఖాజావలి, ఏ.శ్రీనివాసులునాయుడు, యు.బాలకొండయ్య, పి.గోపాలకృష్ణమూర్తి, ఎన్.రవీంద్రబాబు, కమిటీ సభ్యులుగా జి.శ్రీనివాసులు, కె.సురేష్‌బాబు, గిరిబాబు, పి.మజహర్, కె.వి.ప్రసాద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# రాజరాజేశ్వరికి టిటిడి కంకణాలు

మనగుడి కార్యక్రమంలో పంపిణీచేసే నిమిత్తం అవసరమైన కంకణాలు, అక్షింతలను తిరుమల తిరుపతి దేవస్థానము అధికారులు నెల్లూరు జాయింట్ కలెక్టర్ బి.లక్ష్మీకాంతం చేతుల మీదుగా నెల్లూరులోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయానికి కార్యనిర్వహణాధికారి పాయసం నాగేశ్వరరావుకు బుధవారం అందజేసారు. ఆలయ ప్రధానార్చకుడు తంగిరాల రాధాకృష్ణశర్మ కంకణాలు అక్షింతలకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలోని 1250ఆలయాలలో ఈనెల 17వతేది మనగుడి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు రత్నం జయరాం, ధార్మికసలహామండలి ఉపాధ్యక్షుడు కొండాశేఖర్‌రెడ్డి, ఆలూరి శిరోమణిశర్మ, వీరిశెట్టి సుధాకర్, ఆలయ అధికారులు, టిటిడి అధికారులు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

## సందడి మొదలైంది



నెల్లూరులో రొట్టెలపండుగ సందడి మొదలైంది. ప్రతిఏటా బారాషహీద్ దర్గా వద్ద జరిగే రొట్టెల పండుగలో పాల్గొనేందుకు లక్షల సంఖ్యలో భక్తులు నెల్లూరు వస్తుంటారు. ముస్లింలకు దేశంలో వున్న ప్రసిద్ధ ఆధ్యాత్మిక క్షేత్రాల్లో బారాషహీద్ దర్గా ఎంతో ముఖ్యమైంది. మన రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండే కాకుండా, దేశంలోని అన్ని రాష్ట్రాల నుండీ పెద్దసంఖ్యలో భక్తుల రాక మొదలైంది. భక్తుల వాహనాలతో నెల్లూరు రోడ్లు మరింత రద్దీగా మారుతున్నాయి.

### మహిళ క్రీడాకారిణులకు
## అభినందనలు

నెల్లూరు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం మహిళల అంతర్ కళాశాలల క్రీడా పోటీల్లో నెల్లూరు విఆర్‌సి కళాశాల బాస్కెట్‌బాల్, కబడ్డీ, ఖోఖో జట్లు చాంపియన్‌షిప్ సాధించాయి. సోమవారం ఆయా జట్లకు కళాశాలలో అభినందసభ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సివియస్ భాస్కరరావు మాట్లాడుతూ హ్యాండ్‌బాల్‌లో రన్నర్‌గా నిలిచి 35పాయింట్లుతో ఓవరాల్ చాంపియన్‌షిప్‌కు పోటీపడుతున్నట్లు తెలిపారు. వీరికి ప్రోత్సాహకంగా రూ.4 వేలు అందజేస్తున్నట్లు ప్రకటించారు. విఆర్ కళాశాలల సిఇఓ పి.సుదాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ సి.బాబు పాల్గొన్నారు.



నవంబర్ 11వ తేదీన నెల్లూరు రూరల్ మండలం గుడిపల్లిపాడు గ్రామంలో జరిగిన రచ్చబండ కార్యక్రమంలో లబ్ధిదారులకు పట్టాలు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ యన్.శ్రీకాంత్, పక్కన ఎమ్మెల్యేలు ఆనం వివేకానందరెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఆనం విజయకుమార్‌రెడ్డి

## ప్రైవేట్ ట్రావెల్స్‌కు బ్రేక్




మహబూబ్‌నగర్ జిల్లాలో వోల్వో బస్సు దుర్ఘటనతో రవాణా శాఖాధికారులు ప్రైవేట్ ట్రావెల్స్‌పై దాడులు ముమ్మరం చేసారు. దీంతో ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు హడలిపోతున్నాయి. ప్రైవేట్ ట్రావెల్స్ చాలా బస్సులను నిబంధనలు ఉల్లంఘించే నడుపుతున్నాయి. ఇంతకాలం రవాణాశాఖ వాళ్లతో వున్న అవగాహనతో ఈ బస్సులను నడుపుతున్నారు. అయితే వోల్వోబస్సు దుర్ఘటనతో రవాణాశాఖ వాళ్లు మానవత్వంతో స్పందించారు. నిబంధనలను అతిక్రమించి నడుపుతున్న ట్రావెల్స్‌పై కొరడా ఎత్తారు. రవాణాశాఖ దాడుల దెబ్బకు నెల్లూరులో ప్రైవేట్ బస్సులను నిలిపేస్తున్నారు. ప్రతిరోజూ హైదరాబాద్, బెంగుళూరులకు ప్రైవేట్ ట్రావెల్స్ ఏ.సి, నాన్ ఏ.సి బస్సులను పెద్ద సంఖ్యలోనే నడుపుతున్నాయి. అయితే ఒక్కసారిగా అన్ని బస్సులు ఆగిపోవడంతో ప్రయాణీకులు ఆర్టీసీ బస్సులపై పడుతున్నారు. దీంతో ఆర్టీసీ వాళ్లు హైదరాబాద్, బెంగుళూరులకు స్పెషల్ బస్సులు నడుపుతున్నారు.

## కమనీయంగా...శ్రీవారి కల్యాణం



తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూధర్మప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో నెల్లూరు నగరం దర్గామిట్ట టిటిడి కల్యాణ మండపంలో ఆదివారం శ్రీవారి జన్మ నక్షత్రం శ్రవణాన్ని పురస్కరించుకుని శ్రీవారి కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. వేదపండితులు వేదగిరి ఫణిశర్మ, గోవింద గిరిధర్ ఆధ్వర్యంలో దేవదేవేరుల ఉత్సవమూర్తులను కల్యాణ వేదికపై ఉంచి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, గంధం, పన్నీరు, పంచామృతం తదితర సుగంధ ద్రవ్యాలతో తిరుమంజనం నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసులు వజ్రాభరణాలతో సర్వాలంకారంగా దివ్యమంగళ స్వరూపంతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా కళాకారులు ఆలపించిన "అన్నమాచార్య కీర్తనలు, చిన్నారుల కోలాట ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం పుష్పయాగం నిర్వహించారు. శ్రీవారి దివ్యపాదాలచెంత ఉంచిన కంకణాలు, అక్షింతలు చందనం, లడ్డూప్రసాదాన్ని భక్తులకు పంపిణీచేశారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా ధనుంజయ, చంద్రసేన దంపతులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఉపకార్యనిర్వహణాధికారి పార్వతి, దేవాదాయశాఖ జిల్లా ఉపకమీషనర్ వేగూరు రవీంద్రరెడ్డి, హిందూధర్మప్రచార పరిషత్తు అధ్యక్షులు సివి సుబ్రహ్మణ్యం, వాకాటి విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రోలర్‌స్కేటింగ్ రాష్ట్ర కన్వీనర్‌గా వెంకటేశ్వర్లు

రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ సెలక్షన్ కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా ఎన్.వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఇటీవల రోలర్‌స్కేటింగ్ రాష్ట్ర అసోసియేషన్ ఉత్తర్వులు జారీచేసింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ డిసెంబర్ 9 నుంచి 12వరకు గుజరాత్‌లోని రోలర్‌స్కేటింగ్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టు ఎంపికకు కన్వీనర్‌గా తాను వ్యవహరించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర కన్వీనర్‌గా నియమించిన అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు జె.సుధాకర్‌రెడ్డి, రాంప్రసాద్ శ్రీవాత్సవకు కృతజ్ఞతలు తెలిపారు. వెంకటేశ్వర్లు నియామకంపై సింహపురి స్పోర్ట్స్ ఫౌండేషన్ చైర్మెన్ ముక్కాల ద్వారకానాథ్ హర్షం వ్యక్తం చేసారు.

## అయ్యప్పమాలతో ఉంటే సెలవు తీసుకోండి

పోలీసు సిబ్బంది ఎవరైనా అయ్యప్పమాలాధారణ ధరించివుంటే సెలవు తీసుకోవాలని నెల్లూరు జిల్లా ఎస్పీ పివియస్ రామకృష్ణ సూచించారు. విధుల్లో ఉంటే యూనిఫాం వేసుకోవాల్సిందేనని, పోలీస్‌స్టేషన్లలో ఈ ఆదేశాలు అమలవ్వాలన్నారు. లేదంటే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

## నెల్లూరులో భారీ వాహనాలు నిషేధం

నెల్లూరు నగరంలోకి భారీ వాహనాలను అనుమతించకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ పివియస్ రామకృష్ణ ట్రాఫిక్ అధికారులను ఆదేశించారు. భారీ వాహనాలను అనుమతిస్తే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నందున ముందస్తుగా గట్టి చర్యలు తీసుకున్నారు. నెల్లూరు హైవే నుంచి నగరంలోకి వచ్చే భారీ వాహనాలను పాతచెక్‌పోస్టు నుంచి మైపాడు గేటు వైపుగా దారి మళ్ళించారు. ఉదయం 9 నుంచి రాత్రి 10 గంటల వరకు నగరంలోకి భారీ వాహనాలు రాకపోకలను నిషేధించారు.

## ఐటిఐలో కొత్త కోర్సులు

నెల్లూరు దర్గామిట్ట ప్రభుత్వ బాలికల ఐటిఐలో నిరుద్యోగ యువతకు పాలిటెక్నిక్ ద్వారా సామాజికాభివృద్ధి పథకంలో భాగంగా కొత్త సర్టిఫికేట్ కోర్సులు ప్రారంభిస్తున్నట్లు ఐటిఐ ప్రిన్సిపల్ టి.నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. బాలబాలికలకు కోర్సులు ఉన్నట్లు తెలిపారు. ప్లంబింగ్, కార్పెంటరి, వెల్డింగ్, రిఫ్రిజిరేషన్, ఎయిర్‌కండీషనింగ్, హౌస్‌వైరింగ్, మోటారు రీవైండింగ్, మొబైల్ ఫోన్, టీవీ సర్వీసింగ్, డెస్క్‌టాప్ పబ్లిషింగ్, కంప్యూటర్ హార్డ్‌వేర్ కోర్సులకు పదవతరగతి పాసై ఉండాలని, మిగతా కోర్సులకు ఏడవ తరగతి పాసై వుంటే చాలన్నారు.

దరఖాస్తు విధానం ఇతర వివరాలకు 0861 -2324066 ఫోనులో సంప్రదించాలన్నారు.

## ఏసీబి సిఐ చంద్రమౌళి బదిలీ

నెల్లూరు అవినీతి నిరోధకశాఖ కార్యాలయంలో సిఐగా పనిచేస్తున్న సిహెచ్ చంద్రమౌళిని బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ కార్యాలయం నుండి నెల్లూరు ఏసిబి డీఎస్పీ కార్యాలయానికి సోమవారం ఉత్తర్వులు అందాయి. చంద్రమౌళి విధుల నుంచి రిలీవ్ అయిన తర్వాత ఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. చంద్రమౌళి మూడేళ్ళుగా ఏసిబి విభాగంలో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర అవతరణ దినోత్సవంలో ఆయన పోలీసు సేవా పతకం అందుకున్నారు.

### విభిన్నంగా.. విశేషంగా...
## "ప్రేరణ" నిచ్చిన విజ్ఞాన ప్రదర్శన



నెల్లూరు దర్గామిట్ట సరస్వతీనగర్‌లోని డా॥ కిషోర్‌స్వరత్నం స్కూలులో ఈ నెల9న "ప్రేరణ" పేరుతో విజ్ఞాన ప్రదర్శనను నిర్వహించారు. ప్రదర్శనలో ప్రాథమిక స్థాయి విద్యార్థులు సైంటిఫిక్ వర్కింగ్ మోడల్స్ విభాగంలో హైడ్రాలిక్ బ్రిడ్జ్, సోలార్‌సిస్టమ్, మానవ శరీర భాగాలు, రాకెట్లు, వివిధ రకాల మొక్కలు, జంతువులు, నీటి వినియోగాలు ఉన్నత వ్యక్తుల వేషధారణ చేసి ఉపన్యసించి అందరినీ అబ్బురపరిచారు. వేషధారణలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం, విశ్వవిఖ్యాత నటసార్వభౌమ ఎన్.టి.రామారావు, మౌలానా అబ్దుల్‌కలామ్ ఆజాద్, ఇందిరాగాంధీ రూపాలలో ఉపన్యాసాలిచ్చి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమంలో రత్నంస్కూల్స్ జనరల్ మేనేజర్ రామ్మూర్తి నాయుడు, సీనియర్ మేనేజర్ రాజేష్‌బాబు, ప్రిన్సిపల్ రేవతి, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## 'స్మైల్ వాకర్స్' సామాజికసేవ



నెల్లూరు ఏసి స్టేడియంలో ప్రతినెలా స్మైల్ వాకర్స్ నిర్వహించే సామాజిక సేవలో భాగంగా ఈనెల 10న పోలీస్ కాలనీలోని స్త్రీ అభివృద్ధి & శిశుసంక్షేమ బాలసదన్"లోని బాలలకు పౌష్టికాహారం పంపిణీ చేసారు. అలాగే భక్తవత్సలనగర్‌లోని మదర్‌థెరిస్సా హోమ్‌లో రొట్టెలు పంచిపెట్టారు. కార్యక్రమంలో వాకర్స్ ఏకొల్లు రాఘవరెడ్డి, గణపం రాజగోపాల్‌రెడ్డి, టి.వి.సుబ్బారావు, రోశయ్య, సుబ్రహ్మణ్యం, భక్తవత్సలరెడ్డి, కె.వెంకటకృష్ణ జడుగు రవీంద్రనాథ్, శ్రీనాథరెడ్డి, బాబూరావు, డి.లక్ష్మణ్, డి.శ్యాంప్రసాద్, ఇస్మాయిల్, ఊతముక్కల రమణయ్య, ప్రేమయ్య, లెనిన్ టైలర్ మదార్, రఫీ, ప్రసాద్‌రాజు, ఏపిపి ప్రసాద్, లక్ష్మీనారాయణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

## బస్తీమే సవాల్



నిరాధార ఆరోపణలు, లేనిపోని కల్పితాలు చేసేవారు తగిన ఆధారాలతో బహిరంగ చర్చకు రావాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు నెల్లూరు నగరం 27వడివిజన్ మాజీ కార్పొరేటర్ సన్నపురెడ్డి పెంచలరెడ్డి సవాల్ విసిరారు. ఆదివారం నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలోని తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. తన రాజకీయ ఎదుగుదలను చూడలేక ఒక మాజీ కౌన్సిలర్, మరికొంత మంది అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. తనపై ఆరోపణలు చేస్తున్న వారు అయిదుసార్లు పదవులను వెలగబెట్టినా ఏమిచేయలేకపోయారని, తాను ఒక్కసారి కార్పొరేటర్‌గా వ్యవహరించి ఎంతో అభివృద్ధి సాధించానన్నారు. తన 27వ డివిజన్‌ను 10కోట్ల నిధులతో అభివృద్ధిచేసి దాదాపు 1200మంది పేదలకు ఇళ్ళస్థలాల పట్టాలను ఇప్పించేందుకు కృషిచేసానన్నారు. ప్రభుత్వం కేటాయించిన స్థలాలను వారు అమ్ముకుంటే తప్పులేదుగాని, తాను కొనుగోలు చేస్తే మాత్రం తప్పా అని ప్రశ్నించారు. త్వరలోనే తనపై ఆరోపణలు చేసేవారిపై కరప్రతాలు వేసి ప్రచారం నిర్వహిస్తానని హెచ్చరించారు.

PDF Compressor Free Version

PDF Compressor Free Version





ఈ నెల 11వ తేదీన ఇస్కాన్ మందిరం ఆధ్వర్యంలో నెల్లూరు రూరల్‌లోని కాకుపల్లిలో నిర్వహించిన వనభోజనాలలో పాల్గొన్న ఇస్కాన్ ప్రతినిధి డా॥ సుఖదేవస్వామి, భక్తులు

# 23న జాతీయ లోక్‌అదాలత్

**- జిల్లా జడ్జి కనకదుర్గారావు**

ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ఈ నెల 23వ తేదీన జాతీయలోక్‌అదాలత్‌ను దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఛైర్మెన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సిహెచ్ కనకదుర్గారావు తెలిపారు. జిల్లాకోర్టు ప్రాంగణంలోని న్యాయసేవాసదన్ భవన్‌లో ఇటీవల విలేకర్లతో మాట్లాడారు. నెల్లూరు నగరంతోపాటు కోవూరు, కావలి, గూడూరు, వెంకటగిరి, ఆత్మకూరు, కోట, సూళ్లూరుపేటల్లో 23న లోక్‌అదాలత్ నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే బీమా కంపెనీలు, బ్యాంక్‌లు, బిఎస్ఎన్ఎల్, ఏపీయస్ఆర్‌టిసి, ఏపిఎస్ఈబి, చిట్‌ఫండ్ కంపెనీల అధికారుల ప్రతినిధులతో సమావేశం జరిపామని ఎక్కువ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని కోరామన్నారు. ఈ లోక్‌అదాలత్‌లో క్రిమినల్, సివిల్, చెల్లని చెక్కులు, ప్రమాదబాధిత కేసులు, కుటుంబ వివాదాల కేసులు, లేబర్‌కేసులు, భూవివాదాలు, రెవెన్యూ, విద్యుత్, నీటిబిల్లులు, ప్రిలిటిగేషన్, రాజీకి వీలైన క్రిమినల్ కేసులను పరిష్కరిస్తామని వివరించారు. ఈ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకుని త్వరితగతిన న్యాయం పొందాలన్నారు.

# పెన్నా బ్యారేజీ పనులు పూర్తయ్యేనా?

సింహపురి సమాచారం



జలయజ్ఞంలో భాగంగా 2007-2008లో ఆరో నెంబరు ప్యాకేజీ కింద నెల్లూరు పెన్నానదిలో బ్రిడ్జికమ్ బ్యారేజీ పనులు నిర్మాణం చేపట్టారు. ఈ నిర్మాణ పనులను కాంట్రాక్టర్ పలుమార్లు ఆపేసి వెళ్ళడం, అధికారులు నోటీసులతో తిరిగి పనులు చేపట్టడం, మరలా డిజైన్లలో మార్పు కారణంగా అదనపు మొత్తం డిమాండ్‌తో కాంట్రాక్టర్ పనులు మళ్ళీ ఆపేయడం ఇలా జరుగుతోంది బ్యారేజీ పనులు. కర్ణుడి చావుకు సవాలక్ష కారణాలన్నట్లు బ్యారేజీ నిర్మాణానికి అదనంగా 130కోట్లును కాంట్రాక్టర్ డిమాండ్ చేయడం దానికి అధికారులు అంగీకరించకపోవడం దీంతో పనులు అర్ధాంతరంగా ఆగిపోవడం ఇలా జరుగుతోంది యవ్వారం. ఆఖరికి అదనపు పనులకుగాను, 18కోట్లు చాలని అధికారులు లెక్కలు తేల్చడం, గిట్టుబాటు కాదంటూ కాంట్రాక్టర్ పనులు మరలా ఆపేయడం ఇదీతంతు. మొదట 126.70కోట్లతో పనులు చేయడానికి ఎకేఆర్ కోస్టల్ జాయింట్ వెంచర్ సంస్థ అగ్రిమెంటు కుదుర్చుకుంది. ఇప్పటి వరకు 80కోట్లు నిర్మాణానికి ఖర్చుపెట్టారు. 130కోట్లు అదనంగా అవసరమని అధికారులపై ఒత్తిడి తెచ్చారు. 18కోట్లు అవసరమని అధికారులు నివేదికను సిద్ధంచేసారు. దీంతో కాంట్రాక్టర్ మరలా పనులు ఆపేసి వెళ్ళిపోయినట్లు సమాచారం. పెన్నా బ్రిడ్జి బ్యారేజీ పనులు ఎప్పుడు పూర్తవుతాయోనని నెల్లూరు ప్రజానీకం వేయికళ్ళతో ఎదురు చూస్తున్నారు.

# తప్పు చేస్తే కొరడా తీస్తా!

## ప్రభుత్వ డాక్టర్లపై కలెక్టర్ ఆగ్రహం..



లక్షల్లో జీతాలు తీసుకుంటూ గదుల్లో కూర్చుంటే సరిపోదని ప్రభుత్వ ఆసుపత్రులకు వస్తున్న రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు, వసతులు కల్పించాలని నెల్లూరు జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ సంబంధిత డాక్టర్లపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేసారు. నెల్లూరు దొడ్ల సుబ్బారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ నెల 9న అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్లపై మండిపడుతూ ఆసుపత్రిలో ఎక్కడ తరబడి పారిశుధ్యం అధ్వాన్నంగా ఉంటే అధికారులు పట్టించుకోవడం లేదని, వార్డుల్లో కుక్కలు, పందులు తిరుగుతుంటే చూస్తూ ఊరుకుంటున్నారని మండిపడ్డారు. ఆసుపత్రి నిర్వహణ మీకు చేతకాకపోతే విధులకు స్వస్తిచెప్పి వెళ్ళిపోవాలన్నారు. దాదాపు 7కోట్లకు పైగా జీతాలు తీసుకుంటూ ఆసుపత్రి నిర్వహణకు 80లక్షలు ప్రతిపాదనలు పంపడం దారుణమన్నారు.

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి మాట్లాడుతూ ఏసీ గదుల్లో కూర్చుని వేలకు వేలు జీతాలు తీసుకుంటున్నారని అలాంటి వారు అవసరం లేదన్నారు. ఈ సమావేశంలో డిసిహెచ్ డాక్టర్ నిర్మల, సూపరింటెండెంట్ డాక్టర్ రవీంద్రనాథ్‌ఠాగూర్, ఆర్ఎంవో ఉషాసుందరి మునిసిపల్ కమీషనర్ శ్యాంసన్, ప్రొఫెసర్లు, వైద్యులు పాల్గొన్నారు.

# సీమాంధ్ర మంత్రులా... ఇటాలిన్ బిడ్డలా?

**- కోటంరెడ్డి**



నెల్లూరులోని ఉమ్మారెడ్డి గుంట ప్రాంతంలో ఈనెల 10న వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో సమైక్యాంధ్ర ఆత్మీయ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వైఎస్సార్సీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ నిన్నటిదాకా సమైక్యాంధ్ర కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధమన్న సీమాంధ్ర కేంద్రమంత్రులు నేడు ప్యాకేజీల మంత్రం జపిస్తూ రాష్ట్ర విభజనకు మద్దతు తెలుపుతున్నారని విమర్శించారు. సీమాంధ్ర ప్రాంత కేంద్రమంత్రులు సీమాంధ్ర బిడ్డల్లా వుండకుండా ఇటాలియన్ బిడ్డల్లా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ధృతరాష్ట్ర కౌగిలిలో చిక్కుకుని రాష్ట్రం విలవిలలాడుతుంటే ప్రతిపక్ష పార్టీనేత చంద్రబాబు నాయుడు చోద్యం చూస్తున్నారని పేర్కొన్నారు. సమైక్యాంధ్ర కోసం పోరాటం చేస్తున్న జగన్మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరుతూ ఈ ఆత్మీయ కార్యక్రమం జరుపుతున్నామని తెలిపారు.

కార్యక్రమంలో రాఘవరెడ్డి, నవాజ్, సాయి, రాంబాబు, రాజేష్, శంభు, బాబు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# అయ్యోర్ల చీటింగ్‌పై కేసులు

నెల్లూరుజిల్లాలో 272 మంది ఇంగ్లీషు సబ్జెక్టులో పదోన్నతులు పొందగా వారిలో 87మందిపై కేసులు నమోదయ్యాయి. ఈ పదోన్నతుల వ్యవహారం ఇప్పటిది కాకపోయినా కేసులు మాత్రం తాజాగా నమోదయ్యాయి. 87మంది సెకండరీ గ్రేడ్ టీచర్ల(ఎస్‌జిటీ)పై చీటింగ్, ఫోర్జరీలకు సంబంధించి 420, 468, 471 సెక్షన్ల క్రింద కేసులు నమోదుచేసారు. ఈ వ్యవహారంలో గతనెల 30న సిఐడి విభాగం రాష్ట్రవ్యాప్తంగా కేసులు నమోదు చేసింది. కొంతమంది ఉపాధ్యాయులు చెల్లుబాటుకాని ఇతర రాష్ట్రాల్లోని యూనివర్శిటీల సర్టిఫికెట్లను పొందుపరిచి పదోన్నతులు పొందారు. తదుపరి పదోన్నతులు పొందాల్సిన తమకు తీవ్రంగా అన్యాయం జరగడంతో ఈ అక్రమాలపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేసారు. పదోన్నతులు కల్పించేప్పుడు ప్రభుత్వం నుంచి ఇతర రాష్ట్రాల యూనివర్శిటీల నుంచి పొందిన పట్టాలు చెల్లుబాటు కావనే అంశం ఎక్కడా పేర్కొనకపోవడంతో సదరు పట్టాలు పొందారు. అప్పట్లో ఈ వ్యవహారంపై ప్రభుత్వం శాఖాపరంగా చేపట్టిన విచారణ నత్తనడకన సాగడంతో పలువురు ఉపలోకాయుక్తను ఆశ్రయించారు. దీంతో ఉపలోకాయుక్త సిఐడితో విచారణకు ఆదేశించింది. విచారణ చేపట్టిన సిఐడి అక్రమ పదోన్నతులపై నివేదికను రూపొందించింది. ఈ మేరకు జిల్లాలోని పలు మండలాల్లో ఎస్‌జిటీలుగా పనిచేసి స్కూలు అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందిన 87మందిపై కేసులు నమోదు చేసారు.

# ఏకగ్రీవంగా కార్పొరేషన్ ఉద్యోగుల ఎన్నిక

నెల్లూరు నగర మునిసిపల్ కార్పొరేషన్ ఉద్యోగుల సంఘ ఎన్నికలు ఇటీవల నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగాయి. సంఘ సర్వసభ్యసమావేశం అనంతరం సభ్యుల పదవీకాలం పూర్తయినందున 25మందితో కూడిన నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చక్రపాణి వరుసగా మూడవ సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా శామ్యూల్, ఎన్.శ్రీనివాసులు, కార్యదర్శిగా సునీల్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా జీవి.రమేష్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యనిర్వాహణ కార్యదర్శిగా మోజెస్, సమన్వయకర్తగా శ్రీనివాసులు, మహిళ నాయకురాలిగా పద్మావతి, కోశాధికారిగా సయ్యద్ దిలావర్ సంయుక్త కోశాధికారిగా కృష్ణారావులు ఎన్నికయ్యారు. వీరితో పాటు మరో 15మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లను ఎన్నుకున్నారు.

# రెడ్ క్రాస్ రక్త నిధికి వాటర్‌కూలర్ వితరణ

రెడ్‌క్రాస్ రక్తనిధికి నెల్లూరులోని శ్రీభగవాన్ మహావీర్ ట్రస్ట్ సోమవార్ రూ.40 వేలు విలువ చేసే వాటర్ కూలర్‌ను అందించారు. సేవాసంస్థ తరఫున మోహన్ లాల్‌జైన్, జెపిజైన్, విక్రమకుమార్ జైన్, నీలిబాయిలు ఈ సహాయన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రక్తనిధి కన్వీనర్ డాక్టర్ పద్మావతి, వైద్యాధికారి డాక్టర్ జోతియానా, డాక్టర్ పెంచలసుబ్బయ్య, మాజీ కార్యదర్శి డాక్టర్ ఎవి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

# శతరూపవికాస మహోత్సవంలో సింహపురి చిన్నారులు



ఆంధ్రప్రదేశ్ సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో గత నెల 31న నిర్వహించిన శతరూప సాంస్కృతిక, తెలుగుభాష వికాస మహోత్సవంలో నెల్లూరు శ్రీగురుకృప కళాక్షేత్రం విద్యార్థులు చేసిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆ సందర్భంగా గురుకృప కళాక్షేత్రం అధినేత్రి సురభి గాయత్రి వివరాలను తెలిపారు. చిన్నారులు శ్రీజ, తనుశ్రీ, మేఘన, హార్షిణి, లక్ష్మీప్రణతి, తేజస్విని, రుషికలు భరతనాట్య ప్రదర్శనలు చేసి అందరి మన్ననలు అందుకుని ముఖ్యఅతిథుల చేతులమీదుగా జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందుకున్నారని తెలిపారు.

NKV INTERNATIONAL
(A Unit of NKV)
• Air Ticketing • Passport Assistance • Visa Assistance
• Tour Package • Hotel Bookings • Foreign Exchange
Nimmala Balakrishna, M.B.A.
Proprietor
Mobile: 9704 661144
0861 - 2313744

# 16-2-343, IInd Floor, Santhi Sweets, Vijayamahal Center, Nellore - 2.
E-mail : nkvintl@gmail.com, nkvtravelservices@yahoo.com
nkvtravelservices@gmail.com

PDF Compressor Free Version



కదంబం

## స్త్రీలు - పురుషులు

డా॥పాపినేని శివశంకర్,
గుంటూరు, 85008 84400.


నేలపై మొలిచిన దయా దేవదారు వృక్షాలు స్త్రీలు
వాళ్ళు కరుణలేని పెనుగాలులు
స్త్రీలు అగాధ సంక్షుభిత సాగర కన్యలు
సాహసోపేతులైన జాలరి వలలు వాళ్ళు
సతత రక్తప్లావిత క్షతయోనులు స్త్రీలు
వాళ్ళు అయుధధారులైన అవివేకయోధులు
ఎడతెగని గాయాల మాలలు స్త్రీలు
విలాస మాలాధారులు వాళ్ళు
స్త్రీలు ఎండిపోని వక్షోజప్రేమధారలు
వాళ్ళు తపన దీరని దాహమోహితులు
సెలవులేని చేతులు కండెలు గట్టిన ఇంటి సంకెళ్ళ కాళ్లు
స్త్రీలు నిరంతర గృహ సేవికలు
పడక్కుర్చీ యజమానులు వాళ్ళు

తొలి వేకువలు చల్లని సాయంకాలాలు వెన్నెల రాత్రులు
రాత్రి అంచుపై దిగిన రెక్కల దేవకన్యలు
తనయలు యువతులు తల్లులు ముత్తవ్వలు
సృష్టికి మూలహేతువులు
బతుకంతా తడి ఆరని కనురెప్పలు
పురుషుల తలలపై ఎప్పటికీ వీడని చలచల్లని గొడుగులు
స్వేచ్ఛాగర్జనలు పోరాట సమాయత్తులు
ప్రపంచంలో సగం కోరుకొనే వాక్కు

"Vagina is a wound that never heels up"
- Norman Mailer

జమ్మలమడుగులో

## "సింహపురి" కవి సమ్మేళనం



వైఎస్సార్ జిల్లా, జమ్మలమడుగు ముద్దనూరు రోడ్డులోని సాయిబాబా ధ్యాన మందిరంలో సింహపురి సాహితీ సమాఖ్య అధ్వర్యంలో బాధ్యులు పూల చలపతి నిర్వ హణలో కవిసమ్మేళనం జరిగింది. స్థానిక కవులు ఆవుల శ్రీనివాసులు, ఎస్.సుబ్బరాయుడు, కె.రామ్మోహన్, దస్తగిరిలతో పాటు నెల్లూరు కవులు పలువురు పాల్గొని తమ కవితలను వినిపించి అందర్నీ ఆకట్టుకున్నారు. సమాఖ్య అధ్యక్షులు గుణపం రాజగోపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ సలహామండలి సభ్యులు, ప్రముఖ రచయిత రాచపాళెం చంద్రశేఖరరెడ్డి పాల్గొని సాహిత్యంలో పలు అంశాల గురించి ప్రసంగించారు. సమాఖ్య గౌరవాధ్యక్షులు యద్దల లలిత సభకు ఆహ్వానం పలుకగా కార్యదర్శి గుర్రాల రమణయ్య, రావూరు శారద తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ఇద్దరు చంద్రుళ్ళు

శ్రీను గల్పిక

అది మాదంటే మాదని తెలంగాణ, సీమాంధ్ర వాళ్లు కొట్టుకుంటున్న భాగ్యనగరం. హైటెక్‌రత్న చంద్రబాబునాయుడు నివాసం. ఇంట్లో ఆయన దిగులుగా కూర్చుని అప్పుడే టీవీలో వస్తున్న 'ఏమండీ ఆవిడవచ్చింది' తెలుగు సినిమాను చూస్తున్నాడు. ఆ సినిమాలో హీరో శోభన్‌బాబుకు వాణిశ్రీ, శారదలు ఇద్దరు భార్యలు. వాళ్లిద్దరి మధ్య శోభన్‌బాబు నలిగి పోతుంటాడు. సీమాంధ్ర, తెలంగాణల సమస్యతో ఇప్పుడు తన పరిస్థితి కూడా ఆ సినిమాలో శోభన్‌బాబులాగే మారిందని చంద్రబాబు బాధపడసాగాడు. అంతలో అక్కడకు స్టైల్ ఆఫ్ సింహపురి, నెల్లూరురూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి(63) వచ్చాడు. అతనిని చూడ గానే చంద్రబాబు ఆశ్చర్యపోయి... ఏం వివేకా గారు, ఇలా వచ్చారు. కొంపదీసి కాంగ్రెస్‌ను వదిలి మా పార్టీలో చేరుతున్నారా అని అడిగాడు. అందుకు వివేకా... ఎవరైనా పెనం మీద నుండి ప్లేటులో పడాలనుకుంటారుగాని పొయ్యిలో పడాలనుకుంటాడా... నేనేం మీ పార్టీలో చేరడానికి రాలేదు. పాత మిత్రుడివి కదా... ఒకసారి పలకరించిపోదామని వచ్చాను. అయినా మీరేంటి ఇంత దిగులుగా వున్నారని అడిగాడు. ఆ మాటతో చంద్రబాబుకు దుఃఖం పొంగు కొచ్చింది. ఏం చేయమంటావ్ వివేకా... మీ సోనియా వల్లే ఈ దుస్థితంతా... రాష్ట్ర విభజన విషయంలో రెండుకళ్ల సిద్ధాంతానికి పోయాను... మీ సోనియాగాంధీ తెలంగాణ ఇవ్వదులే అనే నమ్మకంతో నేను తెలంగాణకు సై అన్నాను. తీరాచూస్తే ఆమె తెలంగాణ ప్రకటించి నా కొంప ముంచింది. ఇటు సీమాంధ్రకు వ్యతిరేకం కాలేక, అటు తెలంగాణను వదులుకోలేక ఛస్తున్నాను. డబుల్ యాక్షన్ చేయలేక సతమతమమవు తున్నాను. నేను సీమాంధ్ర ప్రయోజనాలను కాపాడాకే రాష్ట్ర విభజనకు ఒప్పుమ్మంటే తెలం గాణవాళ్లు కోప్పడుతున్నారు. పోనీ తెలంగాణకు సై అంటే సీమాంధ్రులో నా పార్టీవాళ్లు కారాలు మిరియాలు నూరుతున్నారు. ఇరుప్రాంతాలు నాకు సమానమే అని చెప్పుకోవడానికి నాకు రెండుకళ్లు, రెండు చెవులు, రెండుకాళ్లు, రెండు చేతులు వున్నాయిగాని, నేను రెండు చంద్రబాబు లను కాలేనుగా... నన్ను రాజకీయ ప్రత్యర్థి అనుకోకుండా నీ పాతమిత్రుడిననుకుని, ఈ విషమ పరిస్థితి నుండి నన్ను కాపాడే ఐడియా ఏదన్నా వుంటే చెప్పు అని దీనంగా అభ్యర్థిం చాడు. 'రెండు చంద్రబాబులు' అని చంద్రబాబు నోట వచ్చిన మాటను వివేకా వెంటనే క్యాచ్ చేసాడు. ఆయనకు 'రాముడు భీముడు', 'అపూర్వ సహోదరులు', 'హలోబ్రదర్' సినిమాలు చకచకా గుర్తొచ్చాయి. వెంటనే చంద్రబాబుతో... మీరు నాతోపాటు అమెరికా రండి... ఓ వారం పాటు వుండాలి. మీ సమస్యకు పరిష్కారం దొరుకు తుందని చెప్పాడు. చంద్రబాబు అందుకు ఒప్పుకున్నాడు.

★★★★★

ఓ వారం తర్వాత...

అది కరీంనగర్‌లోని ఓ కళాశాల మైదానం. తెలుగుదేశంపార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ విజయోత్సవ సభ జరుగుతుంది. చంద్రబాబుతో పాటు రేవంత్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు వంటి నేతలు హాజరైవున్నారు. ఆ సభలో చంద్రబాబు మాట్లాడుతూ... నేను ఇచ్చిన లేఖవల్లే ఈరోజు తెలంగాణ రాబోతుంది. ఆరు నూరైనా, నూరు నూటఇరవై ఆరైనా తెలంగాణ సాధించి తీరుతాం... తెలంగాణ కోసం అవసరమైతే నా రక్తంతో పాటు మీ అందరి రక్తాన్ని కూడా ధారబోస్తా... ఇన్నాళ్ళు సీమాంధ్ర నాయకులు తెలంగాణ ప్రజలను మోసగిస్తూ వచ్చారు. తెలంగాణను దోపిడీ చేసారు. హైదరా బాద్ తెలంగాణ ప్రజల సొత్తు. వారే దానిని అభివృద్ధి చేసారు. సీమాంధ్రవాళ్లు హైదరా బాద్‌లో వ్యాపారాలు చేసుకుని వాళ్లు లాభ పడ్డారు. హైదరాబాద్‌పై ఏ మాత్రం పేచీలు పెట్టినా సీమాంధ్రవాళ్ల తలలు తెగనరుకుతాం అని వీరావేశంగా మాట్లాడాడు. ఆయన మాటలతో అక్కడి ప్రజలు రెచ్చిపోయారు. చంద్రబాబు జిందాబాద్ అంటూ జైకొట్టారు. చంద్రబాబులో కరుడుగట్టిన తెలంగాణవాదిని చూసి ఎర్రబెల్లి దయాకర్‌రావు, రేవంత్ రెడ్డిలు తెగ సంబరపడిపోయారు. ఇక తెలంగాణ ఓట్లన్నీ తెలుగుదేశానికే అని మురిసిపోసాగారు.

అదే సమయంలో విజయవాడలో తెలుగు దేశంపార్టీ ఆధ్వర్యంలో సమైక్యాంధ్ర సభ జరుగు తోంది... ఆశ్చర్యంగా అక్కడా చంద్రబాబు వున్నాడు. వేదిక మీద ఆయనతో పాటు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోడెల శివప్రసాద్ రావు, దేవినేని ఉమామహేశ్వరరావు వంటి సీమాంధ్ర నేతలున్నారు. అక్కడ చంద్రబాబు మాట్లాడుతూ... తెలుగుజాతి ఆత్మగౌరవం లోంచి పుట్టిందే మన తెలుగుదేశంపార్టీ. ఈ రాష్ట్రాన్ని విడదీయడానికి ఎట్టిపరిస్థితుల్లో ఒప్పుకునేది లేదు. సీమాంధ్రుల కష్టార్జితమే హైదరాబాద్ అభివృద్ధి... అలాంటి హైదరా బాద్‌ను వదులుకోమంటే ఎలా వదులుకుంటాం. సీట్లు, ఓట్లు కోసమే తెలంగాణ కోరుతున్నారు. ఈ రాష్ట్రం సమైక్యంగా వుండాలన్నదే నా జీవి తాశయం. అవసరమైతే ప్రాణత్యాగానికైనా వెనుకాడను. ఈ రాష్ట్రం సమైక్యంగా వుంచడానికి చివరి రక్తపుబొట్టు వరకు పోరాడుతానన్నాడు. చంద్రబాబులో పక్కా సమైక్యవాదిని చూసేసరికి సోమిరెడ్డి, కోడెలలు సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు.

అయితే అన్ని టీవీఛానెల్స్ కూడా అటు కరీంనగర్‌సభను, ఇటు విజయవాడ సభను ఒకే సమయంలో ప్రత్యక్షప్రసారం చేసాయి. టీవీలో సగం స్క్రీన్‌పై కరీంనగర్ సభ, సగం స్క్రీన్‌పై విజయవాడసభ దృశ్యాలను చూపెట్టడం, రెండు చోట్ల చంద్రబాబు కనిపించడంతో జనానికి దిమ్మతిరిగింది. టీవీలలో ఆ దృశ్యాలను చూసిన సోనియా, దిగ్విజయ్, షిండేలకు మతిపో యినంతపనైంది. చంద్రబాబు డబుల్‌యాక్షన్‌తో రెండుచోట్ల పాపులర్ అవుతున్నాడు. అసలు వీరిలో ఒరిజినల్ ఎవరు డూప్ ఎవరు? చంద్ర బాబు బండారం ఎలాగైనా బయటపెట్టాలని సోనియాగాంధీ ఆదేశించింది. దాంతో షిండే వెంటనే... రాష్ట్ర విభజనపై పార్టీల అధినేతలు తమ అభిప్రాయాలను వెల్లడించాలని వెంటనే జీఓఎంను కలిసి నివేదికనివ్వాలని పత్రికా ముఖంగా కోరాడు.

ఆంటోని నేతృత్వంలో జీఓఎం హైదరా బాద్‌కు వచ్చింది. ప్రభుత్వ అతిథిగృహంలో ఆంటోని బృందం కూర్చుంది. కాంగ్రెస్, బీజేపీ, వైకాపా, సీపీఎం, సీపీఐ, ఎంఐఎం, లోక్‌సత్తా నాయకులు వెళ్లి తమ నివేదికలిచ్చారు. తెలుగు దేశం తరఫున మొదట ఒక చంద్రబాబు వెళ్లి నివేదిక ఇచ్చాడు. ఆంటోని దానిని చదివాడు. తెలంగాణ ఇవ్వాలి... హైదరాబాద్‌ను దానికే రాజధానిని చేయాలి. ప్యాకేజీ కూడా తెలం గాణకే ఇవ్వాలి. తెలంగాణకు ఏ మాత్రం అన్యాయం జరిగినా రక్తం ఏరులై పారుతుంది. ఇట్లు... చంద్రబాబు. అని వ్రాసివుంది ఆ నివేదికలో. వెంటనే వార్తాఛానెల్స్ అన్నీ ఆ నివేదిక గురించి బ్రేకింగ్‌న్యూస్‌లో ప్రసారం చేయసాగాయి. ఆ తర్వాత మరో చంద్రబాబు వచ్చాడు. ఆయనా ఓ నివేదిక ఇచ్చాడు. ఆంటోనీ ఆ నివేదికను చదివాడు. తెలుగుజాతిని చీలిస్తే సహించేది లేదు. ఖబడ్దార్, ఈ రాష్ట్రాన్ని సమైక్యంగా వుంచాలి. చీల్చాలని ప్రయత్నిస్తే దేంతో కొడతామో మాకే తెలియదు. ఇట్లు... చంద్రబాబు. ఇది చదివి ఆంటోనికి మతిపో యినంత పనైంది.

చంద్రబాబు ఒక్కడే వచ్చి రెండు రకాలుగా నివేదికలిచ్చాడా.. లేక ఆయన డబుల్‌యాక్షన్ చేస్తున్నాడా? లేక 'అపరిచితుడు' సినిమాలో విక్రమ్‌లాగా యాక్ట్ చేస్తున్నాడా... అని ఆంటోని ఆలోచించసాగాడు. ఆయనకు ఎంతకీ అర్థంగాక పొరపాటున జుట్టుపీక్కుందామని నెత్తిమీద చేయిపెట్టి విషయం అర్థమై ఆ ప్రయత్నం మానుకున్నాడు.

(ఇంకా వుంది)


● శైవక్షేత్రాల్లో కార్తీకశోభ...

## భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయాలు



పరమశివునికి అత్యంత ప్రీతికరమైంది కార్తీకమాసం. ఈ మాసంలో కార్తీకదీపా లను వెలిగించి హరహర మహాదేవ శంభో శంకరా అంటూ భక్తజనులు శైవక్షేత్రాల్లో గరళకంఠుడిని వేడుకున్నారు. కార్తీక సోమ వారాల్లో నెల్లూరు నగరంలోని మూలా పేటలో స్వయంభువుగా వెలసియున్న శ్రీ భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వర స్వామి దేవస్థానం, దర్గామిట్ట శ్రీ రాజ రాజేశ్వరి అమ్మవారి దేవస్థానం, నవాబు పేట, ఉస్మాన్‌సాహెబ్‌పేటల్లోని శివాల యాల్లో సోమశిలలోని సోమేశ్వరాలయం, సంగంలోని సంగమేశ్వరస్వామి ఆలయం, గండవరం ఉదయంకాళేశ్వర స్వామి ఆలయం, భైరవకోన తదితర ప్రముఖ పుణ్య క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు ఆయా పుణ్యక్షేత్రాల్లో కార్తీకస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో మహాన్యాస పూర్వక ఏకాదశరుద్రాభిషేకాలు నిర్వహిం చారు. దేవదేవేరుల ఉత్సవమూర్తులను ఆలయ ప్రధాన మండపాల్లో అధిష్టించి విశేషపూజలు ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. సాయంత్రం ఆకాశదీపాన్ని వెలిగిం చారు. అనంతరం నక్షత్ర దర్శనం చేసు కున్నారు. ఈ సందర్భంగా మూలాపేట శివాలయంలో పల్లకీసేవ నిర్వహించారు. నెల్లూరు రూరల్, నగర శాసనసభ్యులు ఆనం వివేకానందరెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధి కారి కోవూరు జనార్ధన్‌రెడ్డి, దేవస్థాన ధర్మ కర్తల మండలి చైర్మెన్ ఆల్తూరు గిరీష్ కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో ఈ కార్యక్ర మాలు జరిగాయి. శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలోని సుందరేశ్వర స్వామి వారి ఆలయంలో మూలవర్లకు క్షీరాభిషేకం, మహాన్యాసపూర్వక రుద్రాభి షేకాలు నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణాధికారి పాయసం నాగేశ్వరరావు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో రాజరాజేశ్వరి సేవాసమితి అధ్యక్షులు సన్నపురెడ్డి పెంచలరెడ్డి భక్తులు పాల్గొన్నారు.


## మేషం



అశ్వని, భరణి, కృత్తిక 1 పాదము

సభలు సమావేశాలలో పట్టువిడుపులు ప్రదర్శించండి లేకుంటే తగాదాలు సమస్యలు రావచ్చును. ఇంట శుభకార్య నిర్ణయాలు జరుగవచ్చును. దూర ప్రయాణాలుంటాయి. ఆదాయ వ్యయాలు అంచనాలకు తగినట్లుండగలవు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి బాగుండి ఆదాయం పెరుగుతుంది. యజమానులకు పర్యర్లతో సమస్యలుండగలవు. అప్పులతో సమస్యలు తగాదాలు రాగలవు.


## వృషభం



కృత్తిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర్ష1, 2పాదాలు

వ్యాపార వర్గాలకు మంచి అవకాశాలు చేజార వచ్చును. వ్యాపారవర్గాలకు సామాన్య ఆదాయం ఉంటుంది. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. దైవసేవా కార్యములందు ప్రముఖ పాత్ర వహిస్తారు. అనుకున్న పనులు సమర్థవంతంగా జరుపుకొంటారు. ఆహారం ఆరోగ్య విషయాలలో జాగ్రత్త అవసరం. కోర్టు వ్యవహారాలు, ఆస్తి వ్యవహారాలు పరిష్కారమునకు రావచ్చును.


## మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

హామీలు ఇవ్వకండి. సేవా సంస్థలకు, వ్యక్తులకు ఆర్థిక సహాయం చేస్తారు. స్థిరాస్తులపైన షేర్లపైన ఆదాయం పెరుగుతుంది. ప్రముఖులు ఆత్మీయులను కలుసుకొంటారు. వృత్తి వ్యాపారాలలో మంచి అవకాశాలు దొరకడం, ఆదాయం పెరగడం ఉంటుంది. అనుకున్న పనులు సక్రమంగా జరుగుతాయి. మీ సలహాలు సహాయము వల్ల ఇతరులకు మేలు కలుగుతుంది.


## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

కుటుంబంలో స్త్రీలకు అనారోగ్య బాధలుంటాయి. స్థిరాస్తుల లావాదేవీలు నిర్వహిస్తారు. మీ సూచనలు సలహాలతో ఇతరులు లాభపడతారు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఉండి ఆదాయం పెరుగుతుంది. పెద్దలతో, పరిచయాలు, అనుకున్న పనులు సక్రమంగా జరగడం, మీ మీద ఆరోపణలు తొలగిపోయి గౌరవ మర్యాదలు పెరగడం ఉంటుంది. ఉద్యోగార్థులకు అవకాశాలు రావడానికి ఇంకా సమయముంది.


## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఉద్యోగులకు పనిభారం పెరగడం, అధికారులతో సఖ్యత బాగుంటుంది. నిలిచిపోయిన పనులు కొనసాగుతాయి. అనుకున్న పనులను సులువుగా జరుపుకొనడం, ధైర్యంగా నిర్ణయాలు చేయడం జరుగుతుంది. దూర ప్రయాణాలుంటాయి. కోర్టు కేసులు వాయిదా పడటం జరుగుతుంది. అధికారుల తనిఖీలు వల్ల వ్యాపార, ప్రముఖ వ్యక్తులకు ఇబ్బందులుంటాయి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

వృత్తి వ్యాపారాల వ్యాపకం బాగుండి ఆదాయం పెరుగుతుంది. అనుకున్న పనులు సమర్థవంతంగా చేస్తారు. ఉద్యోగార్థులు ప్రయత్నాలు ముమ్మరంగా చేయండి. ఉద్యోగులకు స్థానమార్పు, బాధ్యతలభారం స్థలాలు భూములు లావాదేవీలు వాయిదా వేసుకొంటే మంచిది. వివాహాది శుభకార్య నిర్ణయాలు జరుగుతాయి. స్థిరాస్తులు, షేర్ల మీద లాభాలుంటాయి.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 15.11.2013 నుండి
తేది. 21.11.2013 వరకు

ఈ వారం మేష వృషభ మిధున రాశులలో చంద్రుడు, మేషంలో కేతువు, మిధునంలో గురువు, సింహంలో కుజుడు, తులలో శని బుధ రవి రాహువులు, 17తేది నుండి వృశ్చికంలో రవి, ధనుస్సులో శుక్రుడు సంచరిస్తారు.

### పంచాంగము:

తేది 17 ఆదివారం కార్తీక పూర్ణిమ
కృత్తిక దీపోత్సవము.

### ముహూర్తములు

తేది 15 శుక్రవారం ఉదయం గంట 9.0 నుండి గంట 10.30లోగా ధనుర్లగ్నము వివాహ ఉపనయన వ్యాపార గృహారంభములు.

తేది 20 బుధవారం ఉదయం గంట 9.40 నుండి ధనుర్లగ్నమున వివాహ గృహారంభ వ్యాపార అక్షరాభ్యాసాదులు.


### కార్తీక మాస శుక్ల పక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 15 | శుక్ర | త్రయోదశి | రా॥గం. 7.00వ॥ |
| తేది. 16 | శని | చతుర్దశి | రా॥గం.7.00వ॥ |
| తేది. 17 | ఆది | పూర్ణిమ | రా॥గం.7.25వ॥ |

### కార్తీక మాస కృష్ణ పక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 18 | సోమ | పాడ్యమి | రా॥గం. 8.26వ॥ |
| తేది. 19 | మంగళ | విదియ | రా॥గం.9.50వ॥ |
| తేది. 20 | బుధ | తదియ | రా॥గం.11.41వ॥ |
| తేది. 21 | గురు | చతుర్థి | రా॥గం.1.45వ॥ |


## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

వృత్తి వ్యాపారాలలో వ్యాపకం బాగుండి, ఆదాయం స్వల్పంగా పెరుగుతుంది. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. అనుకోని అవసరాలు పైనబడి కొద్దిపాటి ఋణం చేయవలసి వస్తుంది. ఆహ్వానాలు నోటీసులు అందుతాయి. స్థిరాస్తుల లావాదేవీల అవకాశాలు లభిస్తాయి. ఆలోచనలందు తడబడినా ధైర్యంగా నిర్ణయాలు తీసికొంటారు. డబ్బు, వస్తువులు జాగ్రత్తగా కాపాడుకొనండి.


## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ట

అనవసర వ్యవహారాలలో తలదూర్చకండి. వస్తువులు, డబ్బు పోగొట్టుకొనే అవకాశం ఉన్నది. పట్టుదలతో శ్రమించి పనులు కొనసాగిస్తారు. ఉద్యోగార్థులకు ఇంటర్వ్యూ అవకాశాలు రాగలవు. ఆర్థిక వ్యవహారాల లోను, పెట్టుబడులందును ఆచి తూచి వ్యవహరించండి. మంచి వ్యాపారావకాశాలు చేజారవచ్చును. ఉద్యోగులపై అధికారుల వత్తిడి ఉంటుంది.


## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

స్థిరాస్తుల మీద, షేర్ల మీద ఆదాయం లాభాలుంటాయి. పెండింగ్ సమస్యలు పరిష్కారం కాగలవు. ఆర్థిక, వ్యవహార పరంగా నిర్ణయాలు తీసికొనడంలో సమర్థత చూపుతారు. అనుకున్న పనులను ఏదో ఒక విధంగా నెరవేర్చుకొంటారు. వృత్తి వ్యాపారాలలో మంచి అవకాశాలు లభించి ఆదాయం పెరుగుతుంది. ఉద్యోగులకు పనిభారం, అధికారుల ఆదరణ ఉంటుంది.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ట 1, 2 పాదాలు

ఓర్పు పట్టుదలతో ప్రయత్నాలు కొనసాగించాలి. మీ పనులు ఇతరులకు వదిలిపెట్టితే చిక్కులు రావచ్చును. వ్యాపార అభివృద్ధికి కొత్త పథకాలు ఆలోచనలుంటాయి. ఆర్థికంగా కొద్ది ఇబ్బందులున్నా సామాన్య ఆదాయానికి లోపం ఉండదు. రావలసిన బాకీలు వాయిదాపడగలవు. ఉద్యోగులు తమ విధి నిర్వహణను జాగ్రత్తగా చేయండి, పొరపాట్లు దొర్లే అవకాశమున్నది.

## కుంభం



ధనిష్ట 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

స్థిరాస్తులపై రాబడి, షేర్ల మీద లాభాలుండగలవు. స్థలాలు భూముల లావాదేవీలకు అవకాశాలు లభిస్తాయి. శని, ఆది వారాలలో కొద్ది అనారోగ్య బాధలుంటాయి. వృత్తి వ్యాపారాలలో రాణిస్తారు. ఆదాయం అభివృద్ధి బాగుంటుంది. తొందరపాటు నిర్ణయాలు, దురుసుగా మాట్లాడటం చేయకండి. తగాదాలు విమర్శలు రాగలవు. శుభకార్య నిర్ణయాలు జరుగగలవు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ప్రభుత్వపరంగా జరగాల్సిన పనులు ఆలస్యం కాగలవు. హామీలు, చేబదులు ఇవ్వవద్దు. ఆదాయ వ్యయాలు సంతృప్తికరం, భూముల స్థలాల కొనుగోలుకై డబ్బు సమకూర్చుకొనే పనిలో ఉంటారు. అవసరాలకు ఋణ సదుపాయాలు పొందుతారు. వ్యవహారాలలో ఆటంకాలను అధిగమించడం, కృషికి సేవకు తగిన గుర్తింపు లభించడం జరుగుతుంది.

# లోక్‌సత్తా కోవూరు అధ్యక్షుడుగా షేక్ ఇస్మాయిల్

నెల్లూరులోని లోక్‌సత్తా పార్టీ జిల్లా కార్యాలయంలో ఈనెల 9న కోవూరు నియోజకవర్గ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పార్టీ కార్యకర్తలు కోవూరు నియోజకవర్గ పార్టీ అధ్యక్షులుగా షేక్ ఇస్మాయిల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు మక్కెన అంకయ్యచౌదరి మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గంలో వున్న పార్టీ కార్యకర్తలు, అభిమానులను ఏకతాటిపైకి తెచ్చి అవినీతి రహిత రాజకీయాల కోసం అందరం ఉమ్మడిగా కృషి చేద్దామన్నారు. కోవూరు నియోజకవర్గ పార్టీ అధ్యక్షులుగా ఎన్నికైన షేక్ ఇస్మాయిల్ మాట్లాడుతూ శాయశక్తులా పార్టీ అభివృద్ధికోసం, ప్రజల కోసం ఇక ముందు కూడా శ్రమించి పార్టీని విస్తృత పరుస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌డి రసూల్, సిపి బాబూరావు, నగర కార్యదర్శి ఎన్.నరసయ్య, యువసత్తా బాధ్యులు సురేష్, కె.నవీన్‌కుమార్, రవి, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# 16న దుప్పట్లు పండుగ



నెల్లూరు నగరం మూలాపేట బ్రాహ్మణవీధిలోని గురు నిలయంలో శ్రీభగవాన్ వెంకయ్యస్వామి దేవస్థానంలో ఈనెల 16వతేది శనివారం దుప్పట్లు పండుగను నిర్వహిస్తున్నట్లు శ్రీవారి పాదరేణువు మాకాని వెంకట్రావు తెలిపారు. సోమవారం గురునిలయంలో ఆయన మాట్లాడుతూ 16వసారి దుప్పట్లు పండుగ సందర్భంగా ప్రతి ఏడాదిలాగే ఈసారి పేదలకు, అనాథలకు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసి అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండువేల మందికి దుప్పట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. 1993న గురునిలయంలో గురుదేవుల ప్రతిష్ఠ జరిగిందని 2011న శ్రీస్వామివారి విగ్రహంలో అద్భుతశారీరక మార్పులు వచ్చాయన్నారు. భక్తులు శ్రీస్వామి వారిని దర్శించుకుని తరించాలని ఆయన కోరారు.

# టీ20 టోర్నీలో రన్నర్‌గా నెల్లూరు జట్టు

విజయవాడలో ఈనెల 7 నుంచి 10 వరకు జరిగిన రాష్ట్రస్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్‌షిప్-2013 టీ-20 క్రికెట్ టోర్నీలో నెల్లూరు జట్టు రన్నర్‌గా నిలిచింది. సోమవార్ విలేకర్ల సమావేశంలో జట్టు సభ్యులను క్రికెట్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో అభినందించారు. ఈ సందర్భంగా సూళ్ళూరుపేట వైయస్సార్‌సిపి నాయకుడు భానుప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తనవంతు సహకారం అందిస్తానన్నారు. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ఆర్గనైజర్ బాలాజీ, కెప్టెన్ హంసాప్పృథ్వీచంద్, వైస్ కెప్టెన్ మనోజ్ కుమార్, వేదాయపాళెం నారాయణ కళాశాల ప్రిన్సిపల్ నారాయణ రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ విజయశేఖర్‌రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# టైం బాగున్నట్లు లేదు

నారాయణ హాస్పిటల్ సిఇఓ. వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి మొన్ననే కాంగ్రెస్‌ను వదిలి తెలుగుదేశంలో చేరారు. అయితే ఆయన పార్టీలో చేరిన టైం బాగాలేనట్లుంది. పక్కరోజే ఆయన ప్రయాణిస్తున్న కారు యాక్సిడెంట్‌కు గురైంది. హైదరాబాద్‌కు వెళ్లి చంద్రబాబు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిల సమక్షంలో పట్టాభి తెలుగుదేశంలో చేరారు. ఆదివారం రాత్రి కారులో పట్టాభి, తెలుగుదేశంపార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేమారెడ్డి రామచంద్రారెడ్డి, కోవూరు మాజీ ఏఎంసి అధ్యక్షుడు పూండ్ల అచ్యుత్‌కుమార్‌రెడ్డి, పార్టీ నాయకులు దేవిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జొన్నల శివకుమార్‌లు హైదరాబాద్ నుండి నెల్లూరుకు బయలుదేరారు. సోమవారం తెల్లవారుజామున 4గంటల ప్రాంతంలో సింగరాయకొండ సమీపానికి వచ్చేసరికి డ్రైవర్ కన్ను కొరికాడు. దీంతో కారు అదుపుతప్పి 20అడుగుల గోతిలోకి పల్టీలు కొట్టింది. కారును చూసి లారీడ్రైవర్లు ఆగి కారు అద్దాలు పగులగొట్టి అందులోని నాయకులను బయటకు తీసారు. వీరిలో దేవిరెడ్డి శ్రీనివాసులురెడ్డికి బలంగా దెబ్బలు తగలగా మిగిలిన వారికి స్వల్పగాయాలయ్యాయి. వీరికి నారాయణ ఆసుపత్రిలో చికిత్స చేసారు. గాయపడిన వారిని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పరామర్శించారు.

# ఎంపీటీసీల తుది జాబితా ఖరారు

నెల్లూరు జిల్లాలోని 583 ఎంపీటీసీలతో తుది జాబితాను జిల్లా పరిషత్ అధికారులు మంగళవారం ఖరారు చేశారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ఇటీవల అధికారులు జిల్లాలోని 2011జనాభా లెక్కల ప్రకారం 46మండలాల్లో 583ఎంపీటీసీల జాబితాను తయారుచేసి ముసాయిదా జాబితా ప్రకటించారు. గతంలో జిల్లాలో 599ఎంపీటీసీలు ఉండేవి. సూళ్ళూరుపేట, నాయుడుపేట, ఆత్మకూరు పట్టణాలు మునిసిపాలిటీలుగా మారడం, 15గ్రామాలు నెల్లూరు నగరంలో విలీనంకావడంతో చివరకు 583స్థానాలతో తుది జాబితాను ఖరారుచేసారు.

# ప్రతి ఒక్కరికి న్యాయసహాయం

సమాజంలోని అర్హులైన ప్రతివ్యక్తి న్యాయ సాయం పొందేందుకు భారత రాజ్యాంగం హక్కు కల్పించిందని నెల్లూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సిహెచ్ దుర్గారావు పేర్కొన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో 9వ తేదీ జరిగిన జాతీయ న్యాయసేవా దినోత్సవ కార్యక్రమంలో జిల్లా జడ్జి పాల్గొని మాట్లాడారు. జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో అవినీతికి అడ్డుకట్ట వేసే ఆయుధం న్యాయవ్యవస్థని అది దృఢంగా అందరికీ అందుబాటులోకి తెచ్చే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన సంస్థలే న్యాయసేవా సదన్‌లని అన్నారు. జిల్లా ఎస్పీ పివియస్ రామకృష్ణ మాట్లాడుతూ పోలీసులకు వచ్చే ఎక్కువ ఫిర్యాదుల్లో చాలావరకు తమ పరిధిలో లేనివే వస్తున్నాయని వాటి పరిష్కారం కోసం న్యాయసేవాధికార సంస్థకు పంపి సత్వర న్యాయం అందేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.రామకృష్ణ నగరంలోని వివిధ కోర్టులకు చెందిన న్యాయమూర్తులు న్యాయవాదులు పాల్గొన్నారు.

# ఫణికుమార్‌కు విశిష్ట అర్చక సన్మానం

హైదరాబాద్ ఎన్‌టిఆర్ స్టేడియంలో ఒక టీవీ ఛానల్ నిర్వహించిన కోటి దీపోత్సవ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా విశిష్ట అర్చకులకు సన్మానం జరిగింది. ఇందులో భాగంగా నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెం పెద్దూరులోని శివాలయంలో ప్రధానార్చకుడిగా విధులు నిర్వహిస్తున్న గుదూరు ఫణికుమార్ గురుకుల్ సన్మానం అందుకున్నారు. ఈ సందర్భంగా ఫణికుమార్‌ను పట్టణవాసులు అభినందించారు.

# పేదలకు "కేతా" సహాయం



నెల్లూరులోని స్వతంత్ర పార్కులో ఈనెల 11న కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో "పేదలకు సహాయం చేయండి" కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా స్వతంత్రపార్కు మిత్రమండలి అధ్యక్షులు పాముూరు జయరమేష్‌రెడ్డి 50మంది పేదలకు 200చొప్పున ఆర్థిక సహాయం చేసారు. కార్యక్రమంలో కొమ్మన సీతారామస్వామి, ఇంజనీరు టి.సుధాకర్, అమరా సుబ్బారావు, ట్రస్ట్‌బాధ్యులు కేతా సుబ్బారావులు పాల్గొన్నారు. తదుపరి సాయిరాగాంజలి ఆర్కెస్ట్రా భక్తిగీతాల కచేరి జరిగింది.

PDF Compressor Free Version



## వైభవంగా కల్పవృక్షవాహన ఉత్సవం



నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట పప్పులవీధి మహాలక్ష్మి ఆలయం నుంచి బుధవారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని కల్పవృక్ష వాహన మహోత్సవం వైభవంగా జరిగింది. చిలుకవీకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని అత్యంత వైభవంగా నిర్వహించారు. సింహపురి గోవిందమాల కమిటీ, కనకదుర్గా సేవాసమితి, కొలపర్తి రమేష్ మిత్రమండలి ఆధ్వర్యంలో ఈ నగరోత్సవం జరిగింది. భక్తుల కోలాటాలు, బ్యాండ్‌మేళాలు, బాణా సంచాలతో అన్నమాచార్య కీర్తనలతో కనువిందుగా మహోత్సవం సాగింది. దర్గామిట్ట రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం వరకు జరిగిన ఈ ఊరేగింపులో మహిళా భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## అలరించిన...
## సుమేధ నృత్య ప్రదర్శన



నృజన సాహిత్య సాంస్కృతిక వేదిక అధ్వర్యంలో ఆది వారం నెల్లూరు టౌన్‌హాలులో వక్తృత్వ నృత్య పోటీలను నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీవెంకటేశ్వర కూచిపూడి నృత్య కళా నికేతన్ విద్యార్థిని సుమేధ ప్రదర్శించిన ప్రత్యేక శాస్త్రీయ నృత్య ప్రదర్శన సభికులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం శాస్త్రీయ నృత్య పోటీలలో సీనియర్స్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను వరుసగా పి.ఉషాప్రియ, పి.నవ్య, పి.కృష్ణ కుమారి, జూనియర్స్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సోలేషన్ బహుమతులను వరుసగా ఎ.లక్ష్మీప్రణతి, డి.కిరణ్మయి, ఏ.శ్రీకృతి, ఏ.శివసాయిచరితలు ముఖ్య అతిధుల చేతుల మీదుగా అందుకున్నారు. నృత్య పోటీలకు న్యాయనిర్ణేతగా నాట్యాచార్య ఎస్.రమణయ్య వ్యవహరించారు.

కార్యక్రమ వ్యాఖ్యాతగా కీర్తి అందరినీ అలరించారు. సంస్థ అధ్యక్షులు దగ్గుపాటి రాధాకృష్ణ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

## సొంతగూటికేనా?

(మొదటిపేజీ తరువాయి)

ఇందులో వుంటారనే భావన వుంది. ఇంకా ఈ పార్టీలో కొనసాగడమంటే అది సాహసమే. లేకపోతే ఏ దిక్కులేక ఇక్కడ ఉండాల్సిందే! సీమాంధ్రలో ఇప్పటికే చాలామంది కాంగ్రెస్ నాయకులు జెండాలు మార్చేసారు. ఈ పరంపరలో సర్వేపల్లి ఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తుంది. అయితే ఆయన ఏ పార్టీలో చేరనున్నాడనేది నిన్నటివరకు ప్రశ్నార్థకంగా వుండింది. వైయస్సార్ కాంగ్రెస్‌లో ఆయన కోరుకున్న సీటుపై స్పష్టమైన హామీ లేకపోవడంతో తన చేత రాజకీయంగా తొలిఅడుగులు వేయించిన తెలుగుదేశంపార్టీలోనే చేరాలని ఆయన నిర్ణయించుకున్నట్లు సమాచారం. కిరణ్ సొంత పార్టీ పెడితే అందులో చేరాలని ఆదాల భావించారు. అయితే ఆయన పార్టీ పెట్టే అవకాశాలు లేకపోవడంతో ఆదాల తెలుగుదేశం వైపు మొగ్గుచూపుతున్నారు.

తెలుగుదేశం నుండి నెల్లూరు లోక్‌సభ అభ్యర్థిగా గాని లేదా నెల్లూరు రూరల్, నగరం అభ్యర్థిగా గాని ఆయన బరిలోకి దిగే అవకాశాలున్నాయని సమాచారం. 1999లో ఆదాల రాజకీయ ప్రస్థానం మొదలైందే తెలుగుదేశంపార్టీలో. ఆ ఏడాది జరిగిన ఎన్నికల్లో అల్లూరు నుండి ఎమ్మెల్యేగా గెలిచాడు. తొలిసారే చంద్రబాబు కేబినెట్‌లో గృహనిర్మాణశాఖ మంత్రిగా పనిచేసాడు. 2004లో చంద్రబాబుతో విభేదాలొచ్చి తెలుగుదేశాన్ని వీడాడు. వైయస్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరాడు. 2004, 2009ఎన్నికల్లో సర్వేపల్లి నుండి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా విజయం సాధించాడు. కాంగ్రెస్ విభజన జోలికి పోకపోయి వుంటే మరోసారి ఆయన సర్వేపల్లి నుండి కాంగ్రెస్ అభ్యర్థిగానే పోటీ చేసేవాడు. కాని కాంగ్రెస్ విభజన నిర్ణయంతో మనస్థాపం చెందిన ఆయన ఆ పార్టీని వీడి తెలుగుదేశంలో చేరడానికి రంగం సిద్ధమవుతున్నట్లు విశ్వసనీయంగా తెలుస్తుంది.

## ఎవరిగోల వారిదే!

(మొదటిపేజీ తరువాయి)

ఎక్కడ, దానికి నిధులెలా, ఉమ్మడి రాజధాని, హైదరాబాద్ ఆదాయం, నీళ్లు, కరెంట్ వంటి ప్రధాన సమస్యలపై ఒక అవగాహనకు వచ్చివుండాలి. కాని కేంద్రం వద్ద ఏ సమస్యపై కూడా స్పష్టమైన వైఖరిలేదు. విభజన ప్రకటన చేయకముందే అఖిలపక్షాన్ని ఏర్పాటుచేసి విధివిధానాలపై వారి అభిప్రాయాలు తీసుకుని వుండాలి. రాష్ట్ర విభజన తమ సొంత పార్టీ సమస్య అన్నట్లుగా నిర్ణయం తీసేసుకుంది. అయితే విభజన ప్రక్రియలో బొచ్చెబోలెడు సమస్యలు ఎదురవుతుండేసరికి ఈ పాపాన్ని అందరికీ పులమాలనే ఉద్దేశ్యంతో అఖిలపక్షాన్ని ఆహ్వానించింది. ఈ అఖిలపక్షం సమావేశాన్నన్నా చిత్తశుద్ధితో నిర్వహించారా అంటే అదీలేదు. ఒక్కో పార్టీకి 20నిముషాల టైమిచ్చారు. 5కోట్ల సీమాంధ్ర ప్రజల బ్రతుకులతో, భవిష్యత్‌తో ముడిపడివున్న అత్యంత ప్రాధాన్యతగల అంశానికి కేంద్రం ఇచ్చిన ప్రాధాన్యత 20నిముషాల సమయం. ఇక రాష్ట్రం నుండి వెళ్లిన రాజకీయపార్టీలు తలో వాదన వినిపించాయి. తెలుగుదేశం పార్టీ ఈ సమావేశానికి గైర్హాజరయ్యింది. వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ సమైక్యవాదం వినిపించగా కాంగ్రెస్‌పార్టీ నుండి మాత్రం రెండు వాదనలు వినిపించారు. డిప్యూటీ సీఎం దామోదర రాజనరసింహ తెలంగాణకు అనుకూలంగా మాట్లాడగా, అదే కాంగ్రెస్ నుండి సీమాంధ్రప్రతినిధిగా హాజరైన వట్టి వసంతకుమార్ మాత్రం సమైక్యాంధ్ర కావాలని కోరారు. సీపీఎం ప్రతినిధులు సీమాంధ్ర సమస్యలు పరిష్కరించి విభజన చేయాలని కోరగా, సీపీఐ ఎప్పటిలాగే తెలంగాణవాదన చేసింది. ఎంఐఎం ప్రతినిధి అసదుద్దీన్ ఓవైసీ మాత్రం రాయలతెలంగాణ డిమాండ్‌ను తెరమీదకు తెచ్చారు. యూటీ ప్రతిపాదనను వ్యతిరేకించారు. బీజేపీ మాత్రం అసలు కేంద్రం తన వైఖరిని చెప్పకుండా ఇతర పార్టీల అభిప్రాయాలు కోరడం విడ్డూరంగా వుందని, అసలు మీ విధానమేంటో చెబితే దానిపై మేం స్పందిస్తామని జీఓఎంను నిలదీసారు. అసలు మాకంటూ ఒక విధానమే లేదని ఇక్కడే కేంద్ర హోంమంత్రి సుశీల్‌కుమార్ షిండే చేతులెత్తేయడం జరిగింది.

విభజనపై ఏకాభిప్రాయం మృగ్యమన్నది ఈ సమావేశంతో తేట తెల్లమైంది. కేంద్రం ఆ దిశగా కృషి చేయలేదు కూడా! తొలినుండి ఏకపక్షంగా వ్యవహరించడంతో మిగిలిన పార్టీలు ఈ ధోరణిని నిరసించసాగాయి. దీంతో తెలంగాణపై ఏకాభిప్రాయం ఎండమావిగానే మారింది.

## 'ఛీప్'మినిస్టర్

(మొదటిపేజీ తరువాయి)

అవకాశాలున్నాయి. సొంతపార్టీ అధికారంలో వున్న రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన పెట్టడం కాంగ్రెస్‌పార్టీకే చిన్నతనంగా వుంటుంది. కాబట్టి కిరణ్ స్థానంలో ఎవరిని పెట్టాలనేదే ప్రశ్నగా మారింది. ఇప్పుడున్న పరిస్థితుల్లో తెలంగాణ నాయకులను సీఎంగా పెట్టలేరు. సీమాంధ్ర నుండే నియమించాలి. కిరణ్ తప్పుకుంటే సీఎం పోస్టు తీసుకోమని కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డిని అడిగారు.

మూడునాళ్ల ముచ్చట నాకెందుకని ఆయన నిరాకరించారు. మంత్రులు రఘువీరారెడ్డి, కన్నా లక్ష్మీనారాయణ, ఆనం రామనారాయణరెడ్డిలదీ అదే వరుస. రాష్ట్ర విభజనకు సాక్షులుగా వుండి చరిత్రహీనులుగా నిలిచి పోయేందుకు ఎవరూ సాహసించడంలేదు. కాబట్టే సీఎం పదవి ఇస్తామని పిలుస్తున్నా ఎవరికీ దాని కోసం పరుగులు తీయాలనే ఆసక్తి లేకుండా పోయింది.

## యాక్షన్

(మొదటిపేజీ తరువాయి)

సీమాంధ్రకు పరిమితమవుతుంది. తెలుగుదేశంకు ఇరుప్రాంతాలలో సీట్లు వస్తాయి. 2014లో కేంద్రంలో ఎన్డీఏ అధికారంలోకి వస్తే, టీఆర్ఎస్ కూడా ఎన్డీఏకు మద్దతు నివ్వవచ్చు. రాష్ట్రంలో ఏ పార్టీకి పూర్తి మెజార్టీ రాని పరిస్థితి వస్తే, తెలుగుదేశంకు టీఆర్ఎస్ మద్దతు పలుకవచ్చు. ఎన్డీఏ అధికారంలోకి వచ్చాక ఇంత వివాదాస్పదంగా కాక ప్రశాంత వాతావరణంలో వివాదాలకు అతీతంగా తెలంగాణ ఏర్పాటుచేయవచ్చు. ఇదీ చంద్రబాబు యాక్షన్ ప్లాన్. దీనికి అనుగుణంగానే బీజేపీ నడుచుకుంటోంది. తెలంగాణ ఇచ్చిందన్న ఖ్యాతిని కాంగ్రెస్ ఖాతాలో వేయడంలో తాము భాగస్వాములం కాకూడదనే ఆలోచన కూడా బీజేపీలో వుంది. కాబట్టే సీమాంధ్ర సమస్యలనే ఆ పార్టీ ప్రధానంగా ప్రస్తావిస్తుంది.

## నెల్లూరు వాసవికి సూపర్‌బెస్ట్‌క్లబ్ అవార్డు




విశిష్ట సేవా కార్యక్రమాలకు గాను నెల్లూరు వాసవి క్లబ్ మరియు వనిత క్లబ్‌లకు సూపర్‌బెస్ట్ క్లబ్స్ అవార్డులు లభించాయి. ఈ నెల 11వ తేదీన ఒంగోలులోని మౌర్య హోటల్ నందు జరిగిన నంబూరి డిస్ట్రిక్ట్ కాన్ఫరెన్స్‌లో 45క్లబ్స్‌కు గాను నెల్లూరుక్లబ్‌కు ఈ అవార్డులు ప్రకటించారు. వాసవి క్లబ్ అధ్యక్షులు చలువాది శరణ్‌కుమార్, వనిత క్లబ్ అధ్యక్షురాలు సి.ఉమారాణిలు క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షులు బతా రాములు, ప్రధానకార్యదర్శి టి.వెంకట్రావు, గవర్నర్ నంబూరి పద్మజల చేతుల మీదుగా ఈ అవార్డులు స్వీకరించారు. అలాగే సూపర్‌బెస్ట్ ప్రెసిడెంట్‌గా చలువాది శరణ్‌కుమార్ అవార్డును అందుకున్నారు.

## మధుమేహ రోగుల కోసం...
## "స్మైల్" ఉచిత దంత వైద్య శిబిరం



నెల్లూరు రమేష్‌రెడ్డినగర్ లోని స్మైల్ సూపర్ స్పెషాలిటీ దంత వైద్యశాలలో ఈనెల 14న ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో దాదాపు 300మంది మధుమేహ రోగపీడితులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించి పేస్టులు, బ్రష్‌లు, మందులు పంపిణీచేసారు. ఈ సందర్భంగా స్మైల్ దంత వైద్యశాల అధినేత డా॥జి.కిరణ్ మాట్లాడుతూ మధుమేహ రోగులకు చిగుళ్ళ సమస్యలు, పిప్పి పళ్ళు వచ్చే అవకాశం ఎక్కువగా వుంటుందని, పళ్ళను నిత్యం శుభ్రంగా వుంచుకుంటూ 6నెలలకొకసారి దంత వైద్యుని కలవాలని సూచించారు. ఎల్లప్పుడూ మధుమేహాన్ని అదుపులో వుంచుకుంటూ శరీరంలో గ్లూకోజ్ సమతుల్యతను కాపాడుకొనేలా ఆహార నియమాలు పాటిస్తూ వ్యాయామాన్ని చేయాలని పేర్కొన్నారు.

## ఘనంగా రుద్రాభిషేకం, వనభోజనాలు

జిల్లా బ్రాహ్మణ సేవా సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో కార్తీకమాసం సందర్భంగా మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, వనభోజనాలు ఘనంగా జరిగాయి. ఈ నెల 10వ తేదీన వరిగొండ గ్రామంలోని బ్రహ్మేశ్వరస్వామి వారి దేవస్థానంలో వేదపండితులచే రుద్రాభిషేకం, లలిత సహస్రనామార్చన, విష్ణుసహస్రనామ పారాయణం జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ జ్యోతిష్యశాస్త్ర పండితులు బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు కార్తీకమాస విశేషముల గూర్చి ఉపన్యసిస్తూ కార్తీకమాసం శివకేశవులిరువురికీ ఎంతో ప్రీతకరమైనదని, ఈ కార్తీకమాసంలో ఏ దేవాలయంలో పూజ చేసినా విశేషపుణ్యం లభిస్తుందంటూ కార్తీకదీపం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. బ్రాహ్మణ సేవా సంఘాల సమాఖ్య అధ్యక్షులు గుడ్లదొన వాసుదేవరావు, కార్యదర్శి ఇసుకపల్లి కామేశ్వర ప్రసాద్, కొట్రా సురేష్, డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్, డాక్టర్ వై.నాగదేవిప్రసాద్, యస్.వి.శేఖర్, మహేష్, శ్రీను తదితరుల పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి నెల్లూరు నుండే కాక కోవూరు, బుచ్చి, వింజమూరు, కావలి, గూడూరు, వాకాడు, నాయుడుపేట తదితర ప్రాంతాల నుండి అత్యధిక సంఖ్యలో బ్రాహ్మణులు పాల్గొన్నారు.



ఈ నెల 9వ తేదీన నెల్లూరు ఏసి నగర్‌లోని మున్సిపల్ హైస్కూల్‌లో మురళీ ఆర్ట్స్ జోకింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రముఖ సినీ హాస్యనటులు ఏవియస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న మురళీమోహన్‌రావు, బి.వి.నరసింహం, బీరంగుంట శ్రీనివాసులు తదితరులు

PDF Compressor Free Version



# భయపెడుతున్నారు




తమ కెరీర్ ముగుస్తుందన్న తరుణంలో ప్రియమణి లేడీ ఓరియంటెడ్ చిత్రాలపై పడుతుంది. ఇప్పటికే 'చారులత' చేయగా, ప్రస్తుతం 'చండీ'రూపంలో ప్రేక్షకులను భయపెడుతుంది. ఈ చిత్రం మొదటిరోజు నుండే ప్రేక్షకులకు నరకం చూపిస్తుందట! గతంలో ఛార్మీ కూడా ఇలాగే లేడీ ఓరియంటెడ్, ఐటమ్‌సాంగ్స్ చేసింది... ఇప్పుడీ చేస్తుంది!

# 'రేసు'కు సై



స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా నటిస్తున్న "రేసుగుర్రం" చిత్రాన్ని జనవరిలో విడుదల చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. సురేందర్‌రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి హీరోయిన్లుగా శృతిహాసన్, సలోని నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన యాక్షన్ సన్నివేశాలను ఈ నెల16నుండి చిత్రీకరించనున్నారు.

## మూ'వీ'క్షణం



# 'సుడి' తిరిగేనా?

ఏ నిర్మాతకైన మినిమమ్ గ్యారంటీ ఇస్తాడనే పేరున్న "అల్లరి నరేష్" ప్రస్తుతం ఫ్లాపుల బాటలో పడుతున్నాడు. ఎన్నో ఆశలు పెట్టుకున్న 'కెవ్వుకేక' కూడా ఫ్లాప్ కావడంతో, తన ఆశలన్నీ ప్రస్తుతం చేస్తున్న ఓ తమిళ సినిమా రీమేక్‌పై పెట్టుకున్నాడు. 'సుడిగాడు'లాగే ఇది కూడా హిట్టౌతుందంటున్నాడు.

# నిరాశపరిచిన రజనీ



సూపర్‌స్టార్ రజనీ తాజాగా నటిస్తున్న చిత్రం 'కొచ్చాడయన్'. తెలుగులో 'విక్రమ సింహా'గా రానుంది. మొదట ఈ చిత్రాన్ని దీపావళికి విడుదల చేయాలనుకున్నా, రజనీ జన్మదినమైన డిసెంబర్ 12న విడుదల చేయాలనుకున్నారు. అయితే అది కూడా వాయిదా పడినట్లే కనిపిస్తోంది. 2010లో విడుదలైన 'రోబో' తర్వాత రజనీ సిల్వర్‌స్క్రీన్‌పై కనపడలేదు. ఈ చిత్రంపై రజనీ అభిమానులు ఎన్నో ఆశలు పెట్టుకున్న తరుణంలో ఈ చిత్రం వాయిదా పడుతుండడంతో వాళ్ళు నిరుత్సాహానికి గురవుతున్నారు.



# పాండవులు పాండవులు తుమ్మెదా?

మంచు ఫ్యామిలీ మొత్తం ఇప్పుడు తాము చేయబోయే చిత్రంతో బిజీగా వున్నారు. ఈ చిత్రానికి 'పాండవులు పాండవులు తుమ్మెదా' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు తెలుస్తుంది. ఈ చిత్రంలో మోహన్‌బాబు, విష్ణు, మనోజ్ లతో పాటు తనీష్, వరుణ్‌సందేశ్ నటిస్తున్నారు.

# గూడూరు డివిజన్ వార్తలు

## చట్టాలపై అవగాహన ఉండాలి




సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ సి.మురళీధర్

సమాజంలో ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, తెలిసో తెలియక చేసిన చిన్నచిన్న తప్పులకు జైలుశిక్ష అనుభవించిన తరువాత వారు సన్మార్గంలో నడవాలని గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.రాజారాం అన్నారు. 9వ తేదీ ఆయన గూడూరు సబ్‌జైలులో న్యాయసేవా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఖైదీలనుద్దేశించి మాట్లాడారు. నిరుపేదలకు న్యాయసేవా సంస్థ తమవంతు సాయం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ సి.మురళీధర్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.రజనీకాంత్‌రెడ్డి, లోక్ అదాలత్ మెంబర్, న్యాయవాది రవికుమార్, కోటేశ్వరరావు, గూడూరు సబ్‌జైలు అధికారి ఎస్.కె.అస్లాం తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్లు సక్రమంగా ఇవ్వాలి

గూడూరు పట్టణంలో వృద్ధులు, వితంతువులకు, వికలాంగులకు ఫింఛన్లు సక్రమంగా ఇవ్వడంలేదని వైకాపా స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి ఆరోపించారు. గూడూరులోని పురపాలక సంఘ కార్యాలయం వద్ద ఫించనుదారుల సమస్యల పై ధర్నా నిర్వహించారు. ఆరు నెలలుగా పింఛను సక్రమంగా ఇవ్వడంలేదని తెలిపారు. గతంలో సిబ్బందితో పంపిణీ చేయిస్తే ప్రస్తుతం కొత్తగా ప్రైవేటు వారికి అప్పగించడంతో జాప్యం జరుగుతుందన్నారు. పేదవారు ఫించను కోసం నెలరోజులుగా ఎదురు చూస్తుంటారని దానిపై అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించరాదన్నారు. అనంతరం కమీషనర్ సుశీలమ్మకు సమస్యను వివరించారు. ఈ కార్యక్రమంలో వైకాపా గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త పాశం సునీల్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు నాశిన నాగులు వైకాపా నాయకులు మల్లు విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి పల్లకీసేవ

గూడూరు పట్టణంలోని రాజవీధిలో ఉన్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో 9వ తేదీ ప్రత్యేక పూజలు జరిగాయి. కార్తీకమాసం సందర్భంగా స్వామి భక్తులకు చందనాలంకరణలో దర్శనమిచ్చారు. రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. భక్తులు సాయంత్రం నుంచే ఆలయానికి చేరుకుని పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామి, అమ్మ వార్లను విశేషంగా అలంకరించి భక్తులు పల్లకీసేవలో ఊరేగించారు. అనంతరం ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు ఇచ్చారు.

జిఎఫ్‌ఎఫ్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో

## వికలాంగులకు పరికరాల పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్పీ చౌడేశ్వరి

జిఎఫ్ఎఫ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 9వ తేదీ స్థానిక ఎన్‌జిఓ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో వికలాంగులకు ట్రైసైకిళ్ళు, స్టిక్స్, వీల్‌ఛైర్స్ మరికొంత మందికి ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిఎస్పీ కె.చౌడేశ్వరి మాట్లాడుతూ సమాజంలో వికలాంగులను చిన్న చూపు చూడకుండా వారిని తమలో ఒకరిగా భావించి వారిని ప్రోత్సహించినట్లయితే వారిలో దాగి ఉన్న ప్రతిభ వెలికి తీయవచ్చునని అన్నారు. గూడూరు స్టేట్ బ్యాంకు మేనేజర్ మురళీకృష్ణ మాట్లాడుతూ ఇటువంటి వారికి తమ బ్యాంకు ద్వారా ఆర్థికసాయం అందచేస్తామన్నారు. సంస్థ ఫౌండర్ కృష్ణ మాట్లాడుతూ గూడూరు చుట్టుప్రక్కల ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు తమవంతు ప్రోత్సాహం అందిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో సమైక్యాంధ్ర జేఏసీ నాయకులు వేగూరు రాజేంద్రప్రసాద్, మనపాటి రవీంద్రబాబు, రీడ్ సంస్థ అధ్యక్షుడు సుధీర్ పాల్గొన్నారు.

## విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి



సావనీర్‌ను విడుదల చేస్తున్న ఎంవైఎస్ ప్రసాద్

ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు శాస్త్ర పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని షార్ డైరెక్టర్ డాక్టర్ ఎంవైఎస్ ప్రసాద్ ఉద్బోధించారు. పట్టణంలోని ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 9వ తేదీన మోడరన్ ట్రెండ్స్ ఇన్ కంప్యూటర్ ఎలక్ట్రానిక్స్ సివిల్ అండ్ పవర్ ఇంజనీరింగ్ అంశంపై జాతీయ సెమినార్ జరిగింది. ఇందులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సాంకేతిక రంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పుల కారణంగా కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్ రంగంలో మార్పులను అందుకుంటున్నామని తెలిపారు. స్వదేశీ పరిజ్ఞానంతో సాధించిన ప్రగతి మార్స్‌ప్రాజెక్ట్ ద్వారా అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలబెట్టిందన్నారు. ఈ సందర్భంగా కళాశాల సావనీర్‌ను విడుదల చేశారు. 80మంది విద్యార్థులు పరిశోధన పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య చెంగయ్య, డాక్టర్ ఉమామహేశ్వరరెడ్డి, డాక్టర్ రామకృష్ణ, కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, ఏవో రామయ్య, ప్లేస్‌మెంట్ అధికారి కిషొందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## వైకాపాలో చేరిన వేమారెడ్డి



చిల్లకూరు మండలం తెలుగుదేశంపార్టీ నాయకుడు, పిఎసియస్ అధ్యక్షుడు వేమారెడ్డి కుమారస్వామిరెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో వైయస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఆ పార్టీ అధ్యక్షుడు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి, పార్టీ నాయకులు మేకపాటి గౌతంరెడ్డి, బత్తిని విజయకుమార్, మేరిగ మురళీధర్, డాక్టర్ బాలచెన్నయ్య తదితరుల సమక్షంలో ఆయన వైకాపా తీర్థం పుచ్చుకున్నారు.

## ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

ప్రతిఒక్కరూ బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని దాత ఇసకపల్లి శివప్రసాద్ విద్యార్థులను కోరారు. తన తల్లి విశాలక్షమ్మ జ్ఞాపకార్థం దక్కిలి మండల పరిధిలోని దగ్గవోలు గ్రామంలో 10వ తరగతిలో 500మార్కులు సాధించిన విద్యార్థికి 1116/-రూపాయలు నగదు పారితోషికాన్ని నాలుగేళ్ళ నుండి అందజేస్తున్నారు. ఇందులో భాగంగా 9వ తేదీ ఆయన దగ్గవోలు గ్రామానికి వచ్చి 10వ తరగతి మండల టాపర్‌గా నిలిచిన కె.గౌతమికి ఈ నగదు ప్రోత్సాహకాన్ని ఉపాధ్యాయుల సమక్షంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ శ్రీనివాసులు, గ్రామసర్పంచ్ యద్దల ఉదయకుమార్, మాజీసర్పంచ్ సద్దికూటి రమణయ్య ఇదే గ్రామానికి చెందిన రిటైర్డ్ హెడ్మాస్టర్ చోడగుడి విశ్వనాథం కూడా టాపర్‌గా నిలిచిన గౌతమికి 1016 రూపాయలు అందజేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమ్మ ఫర్నిచర్ మాల్
మినిబైపాస్‌రోడ్, నెల్లూరు.
• సరికొత్త ప్రపంచస్థాయి మోడల్స్
• ఇంపోర్టెడ్ & ఇండియా ఫర్నిచర్
ఫైనాన్స్ సదుపాయము, ఆదివారం షాపు గలదు.

# ఇండియన్ క్రికెట్ 'హార్ట్' రిటైర్

## ఆటకు, ప్రత్యర్థుల వేటకు సెలవు



ప్రపంచ క్రికెట్ చరిత్రలో ఒక మహోన్నత శకం ముగిసింది. 24ఏళ్లుగా క్రికెట్‌తో వున్న ఓ అనుబంధానికి భారంగా వీడ్కోలు పలకాల్సి వచ్చింది. క్రికెట్‌కు దూరమవుతూ ఒకరు, అతను లేని ఆటను చూడ లేక కోట్లాదిమంది క్రికెట్ అభిమానులు బాధతో భారంగా వీడ్కోలు పలికారు.

దాదాపు 24ఏళ్లపాటూ క్రికెట్టే ప్రాణంగా, అదే దైవంగా, అదే పూపిరిగా భావించి, దానితో ఎడతెగని అనుబంధాన్ని పెంచుకున్న రమేష్ సచిన్ టెండూల్కర్ తన ప్రాణ సమానమైన క్రికెట్‌కు వీడ్కోలు పలికారు. పరుగుల వేటలో అలుపెరుగని ఈ యోధుడు క్రికెట్ జీవితానికి సెండాఫ్ చెప్పాడు.

భారత్ క్రికెట్‌లో దేవుడిగా మారిన సచిన్ టెండూల్కర్ చివరి టెస్ట్‌మ్యాచ్ 14వ తేదీ ముంబైలోని వాంఖేడే స్టేడియంలో మొదలైంది. ఇదే సచిన్ చివరి టెస్ట్ మ్యాచ్. అతని కెరీర్‌లో 200వ టెస్ట్‌మ్యాచ్. ఈ మ్యాచ్ తర్వాత అతను క్రికెట్‌కు దూరం కానున్నాడు. గతంలోనే వన్డే కెరీర్‌కు వీడ్కోలు పలికిన సచిన్ 200టెస్ట్‌తో టెస్ట్ కెరీర్‌కు ముగింపు పలుకుతానని ప్రకటించడం జరిగింది. సచిన్ ఎక్కడైతే క్రికెట్ పాఠాలు నేర్చుకున్నాడో అక్కడే ఘనంగా వీడ్కోలు పలకాలనే ఉద్దేశ్యంతో బీసీసీఐ వెస్టిండీస్‌తో జరిగే సచిన్ 200వ టెస్ట్‌మ్యాచ్‌ను ముంబైలోనే ఏర్పాటు చేసింది.

క్రికెట్ ఆటలో రికార్డులకు కొరత లేదు. ఇన్ని రికార్డులు ఏ ఆటలోనూ కనిపించవు. అయితే ఈ రికార్డులు అత్యధిక శాతం సచిన్ పేరిటే నమోదు కావడం గమనార్హం. టెస్ట్ క్రికెట్‌లో అత్యధిక టెస్టులు(200) ఆడిన ఆటగాడు అతడే! సెంచరీలను సెంచరీ దాటించిన మొనగాడు అతనే! టెస్ట్ క్రికెట్‌లో, వన్డే క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన వీరుడు అతనే. అతి చిన్నవయసులో సెంచరీ కొట్టిన మగధీరుడు అతడే! అతని ఆట ముందు రికార్డులే తలవంచాయి. 24ఏళ్లపాటూ ప్రపంచ వ్యాప్తంగా వున్న క్రికెట్ అభిమానులను తన బ్యాట్‌తో అలరించిన సచిన్ ఈరోజు ఆటకు గుడ్‌బై చెబుతుంటే ప్రతి అభిమాని మనసు బాధతో బరువెక్కింది.

# తెలుగు గుండెలకు తూట్లు పొడుస్తున్నారు

ఐదు కోట్ల మంది సీమాంధ్రుల భవిష్యత్తును నిర్ణయించేందుకు అఖిలపక్షం సమావేశంలో పార్టీలకు కేవలం పది, ఇరవై నిమిషాలు కేటాయించడం సీమాంధ్ర ప్రజల మనోభావాలను దెబ్బతీయడమేనని తెలుగుదేశంపార్టీ రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. బుధవారం నెల్లూరులోని తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర విభజన విధి విధానాలు, నిధుల పంపిణీ తదితర విషయాల్లో సరైన స్పష్టత లేకుండా అఖిలపక్షం నిర్వహించడం సిగ్గుచేటన్నారు. హైదరాబాద్ రాజధాని విషయం ఉద్యోగుల పరిస్థితి విద్యార్థుల భవిష్యత్తుపై కేవలం పది, ఇరవై నిమిషాల్లో నిర్ణయం ఎలా తీసుకుంటారో అర్థంకావడం లేదన్నారు. కె.చంద్రశేఖర్‌రావు(కెసిఆర్)కు మాత్రం ఒక్కగంట సమయం కేటాయించి, మిగతా వారికి పది, ఇరవై నిమిషాలు కేటాయించారన్నారు. ఉత్తరప్రదేశ్ తర్వాత అత్యధిక పార్లమెంట్ స్థానాలున్న రాష్ట్రాన్ని అశాస్త్రీయంగా విభజించడాన్ని నిరసిస్తూ తెలుగుదేశం పార్టీ అఖిలపక్షాన్ని బహిష్కరించిందన్నారు. కేంద్రంతో లాలూచి పడి వైయస్సార్‌కాంగ్రెస్‌పార్టీ ఇప్పుడు విభజన శాస్త్రీయంగా జరగాలని, అక్రమ ప్రాజెక్టులని కెసిఆర్ అనడం విడ్డూరంగా వుందన్నారు. పెన్నానదిపై నిర్మించిన ప్రాజెక్టుల గురించి మాట్లాడే నైతిక హక్కు కేసిఆర్‌కు లేదన్నారు. కండలేరు అంతరరాష్ట్ర పథకమని, దాన్ని అక్రమ నిర్మాణమనడం మతిలేని చర్య అన్నారు. కృష్ణపట్నం చుట్టూ పవర్‌ప్రాజెక్టుల వల్ల ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. తాగునీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కృష్ణపట్నం పవర్ కంపెనీలపై చర్యలు తీసుకునే దమ్ము ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌కు లేదా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, తెలుగుయువత ప్రధాన కార్యదర్శి శింగంశెట్టి రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# రంగడి నూతన ధర్మకర్తల మండలి అభినందన సభ

### --- ప్రప్రథమ మహిళా ఛైర్మెన్‌గా భారతి ---



నెల్లూరు పినాకిని నదీతీరాన వేంచేసియున్న శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి దేవస్థానం నూతన పాలకమండలి సభ్యుల అభినందనసభ బుధవారం ఆలయ ప్రాంగణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నెల్లూరు రూరల్, నగర ఎమ్మెల్యేలు ఆనం వివేకానందరెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు ధర్మకర్తల మండలి ఛైర్మెన్‌గా దుగ్గిశెట్టి భారతిని నియమిస్తున్నట్లు తెలిపారు. ఛైర్మెన్, సభ్యుల చేత దేవాదాయ ధర్మదాయశాఖ జిల్లా సహాయ కమీషనర్ వేగూరు రవీంద్రరెడ్డి సంతకాలు చేయించారు. ఈ సందర్భంగా నూతన ఛైర్మెన్ భారతి మాట్లాడుతూ భక్తులకు సేవచేసేందుకు భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి పాయసం నాగేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు పిట్లసాయిరాంరెడ్డి, పిగిలి మధుసూదనరావు, వరిగొండ విజయశంకర్, బొద్దుకూరు లక్ష్మీనారాయణ, కొండేటి రఘునాథరెడ్డి, ఎక్స్ అఫిషియో సభ్యులు కిడాంబి జగన్నాథాచార్యులు పాల్గొన్నారు. సరయూ షోరూం అధినేత అప్పల రాజ్‌కుమార్‌ను తొలుత ఛైర్మెన్‌గా ప్రకటించి కొన్ని కారణాల వల్ల కమిటీ సభ్యుడిగా మార్పు చేయడంతో మనస్తాపంతో హాజరు కాలేదు. మరో సభ్యుడు వైవిరెడ్డి కూడా హాజరుకాలేదు.

నూతన ధర్మకర్తల మండలి సభ్యులను శాలువాలతో, పూల మాలలతో సత్కరించారు.






Edited, Published, Printed & owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Executive Editor-G.SREENIVASULU REDDY.